

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

పరిశ్రమల స్థాపనకు ప్రోత్సాహం

కలెక్టర్ టీఎస్ చేతన్

పుట్టపర్తి టౌన్, జనవరి 9(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పరిశ్రమల స్థాపనకు ముందుకొచ్చే ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వం అన్నిరకాలుగా ప్రోత్సాహకాలు అందిస్తుందని కలెక్టర్ టీఎస్ చేతన్ తెలిపారు. స్థానిక కలెక్టరేట్‌లో గురువారం జిల్లా పరిశ్రమలు, ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. అర్హులైన పారిశ్రామికవేత్తలకు విరివిగా రుణాలు మంజూరు చేస్తామన్నారు. జిల్లాలో పరిశ్రమల స్థాపనకు వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి, సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. అర్హుల జాబితా సిద్ధం చేయాలన్నారు. జిల్లాలో సింగిల్ డెస్క్ పోర్టల్ ద్వారా పరిశ్రమల స్థాపనకు 3,994 ప్రతిపాదనలు వచ్చాయనీ, వాటిలో 3883ని ఆమోదించామన్నారు. 51 ప్రతిపాదనలు తిరస్కరించామన్నారు. కార్యక్రమంలో జిల్లాపరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ నాగరాజు, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ సోనీ సుహాని, ఎల్‌డీఎం రమణ, డీపీఓ సమత, మున్సిపల్ కమిషనర్ ప్రహ్లాద, నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి రాజేశ్, నాబార్డు ప్రతినిధి అనురాధ పాల్గొన్నారు.

కోడిపందేలు నిర్వహిస్తే కేసులు

పుట్టపర్తిటౌన్, జనవరి 9(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ సందర్భంగా జిల్లాలో కోడిపందేలు నిర్వహించినా, పాల్గొన్నా కేసులు నమోదు చేస్తామని కలెక్టర్‌టీఎస్ చేతన్ హెచ్చరించారు. కోడిపందేల నిర్వహణ నేరం అంటూ జిల్లా అటవీశాఖాధికారులు రూపొందించిన పోస్టర్లను కలెక్టర్ గురువారం కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. కోడిపందేల నిర్వహణ చట్టరీత్యా నేరమన్నారు. కేసులు నమోదు చేస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి శుభదాస్ తదితరులు పాల్గొన్నారు.

పరిహారం వచ్చేసిందోచ్..

నెరవేరిన మర్రిమాకులపల్లి వాసుల కల

119 మందికి రూ.9.40 కోట్లు జమ



మంత్రి కేశవ్‌కు వినతిపత్రం అందిస్తున్న మర్రిమాకులపల్లి వాసులు (ఫైల్)

తాడిమర్రి, జనవరి 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని మర్రిమాకులపల్లి వాసుల కల ఎట్టకేలకు నెరవేరింది. చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ (సీబీఆర్) నిర్మాణంలో గ్రామం మునిగిపోయింది. పరిహారం అందక గ్రామస్థులు 20 ఏళ్లుగా అవస్థలు పడుతున్నారు. ఎట్టకేలకు వారికి కూటమి పాలనలో పరిహారం అందింది. సీబీఆర్ నిర్మాణంతో మర్రిమాకులపల్లి పూర్తిగా తుడిచిపెట్టుకుపోయింది. 2006 జనాభా లెక్కల ప్రకారం గ్రామంలో ఉండి 18 సంవత్సరాలు నిండిన వారికి ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ కింద కుటుంబానికి రూ.10లక్షలు చొప్పున 2020లో పంపిణీ చేశారు. అప్పట్లో సాంకేతిక సమస్య ఉందంటూ గ్రామంలోని దళిత కాలనీవాసులకు రూ.6లక్షలు మాత్రమే మంజూరైంది. తమకు రూ.10లక్షలు ఇవ్వాలని వారు పట్టుబట్టారు. 2022లో పరిహారం మంజూరైందనీ, పంపిణీ చేస్తామంటూ అప్పటి అధికారులు 94 మంది సంతకాలు కూడా తీసుకున్నారు. అయినా జమకాలేదు. కాలనీకి చెందిన 137 మందికి పరిహారం మంజూరు చేయాలంటూ స్థానికులు.. రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌ను కలిసి, విన్నవించారు. టీడీపీ ధర్మవరం నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్‌ను కలిసి, విన్నవించారు. ఈ నేపథ్యంలో గురువారం 94 మందికి రూ.10లక్షలు చొప్పున నిధులు ఖాతాల్లోకి జమైనట్లు మెసేజ్‌లు వచ్చాయి. మిగిలిన 15 మందికి రెండు, మూడు రోజుల్లో జమవుతుందని గ్రామస్థులు తెలిపారు.

రేపు వడ్డె ఓబన్న జయంతి వేడుకలు

పుట్టపర్తిటౌన్, జనవరి9(ఆంధ్రజ్యోతి): స్థానిక కలెక్టరేట్‌లో ఈనెల 11వ తేదీన వడ్డె ఓబన్న జయంతి వేడుకలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ టీఎస్ చేతన్ గురువారం ప్రకటనలో తెలిపారు. 11న ఉదయం 9 గంటలకు మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో వడ్డె ఓబన్న చిత్రపటానికి పూలమాల వేసి, నివాళి అర్పిస్తామన్నారు.

పరమ పుణ్య ద్వారం

నేడు వైకుంఠ ఏకాదశి



స్వామి, అమ్మవార్ల దర్శనం కోసం ఆలయం వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక దర్శన క్యూలైన్లు



ముస్తాబైన ఉత్తర ద్వారం



ప్రవేశ ద్వారం వద్ద అలంకరణ

ఉత్తర ద్వార దర్శనానికి ఏర్పాట్లు

ఆలయాలకు పోటెత్తనున్న భక్తులు

కదిరి, జనవరి 9(ఆంధ్రజ్యోతి): వైకుంఠ ఏకాదశి హిందువులకు ఎంతో ప్రత్యేకం. ఈ రోజున ఉత్తర ద్వార దర్శనం ఎంతో శుభప్రదమని విశ్వసిస్తారు. శుక్రవారం వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని జిల్లావ్యాప్తంగా ఆలయాల్లో ఉత్తర ద్వార దర్శనం కల్పించనున్నారు. అందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. అర్ధరాత్రి నుంచే భక్తులు.. ఆలయాలకు పోటెత్తనున్నారు. గోవింద నామస్మరణతో ఆలయాలు మార్మోగనున్నాయి.

ఖాద్రీశుడి సన్నిధిలో..

ప్రసిద్ధిచెందిన శ్రీఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఉత్తర ద్వార దర్శనానికి వేలాదిగా తరలిరానున్నారు. ఉమ్మడి అనంత జిల్లాతోపాటు కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి భక్తులు స్వామివారి దర్శనానికి రానున్నారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా ఆలయ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. పోలీసు అధికారులు కట్టుదిట్టమైన భద్రత కల్పించారు. తూర్పురాజగోపురం, ఉత్తర గోపురంతోపాటు ఆలయం అలంకరణలో శోభిల్లుతోంది. భక్తుల సౌకర్యార్థం తేరువరకు క్యూలైన్లు ఏర్పాటు చేశారు. పురుషులు, మహిళలకు వేర్వేరు లైన్లతోపాటు ప్రత్యేక దర్శనానికి కూడా ఏర్పాటు చేశారు. 80వేలమందికిపైగా భక్తులు స్వామివారిని దర్శించుకుంటారని ఆలయ అధికారులు అంచనా వేస్తున్నారు. తెల్లవారుజామున 3.30 గంటల నుంచి స్వామివారి దర్శనానికి అనుమతిస్తారు.



ఆలయంలో ఏర్పాటు చేసిన క్యూలైన్లు

కట్టుదిట్టమైన భద్రత

ఆలయం వద్ద 250 మంది సిబ్బందితో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు డీఎస్పీ శివనారాయణ స్వామి తెలిపారు. ఇద్దరు డీఎస్పీలు, సీఐలు, ఎస్‌ఐలతోపాటు పోలీసు సిబ్బందితో భద్రత కల్పిస్తున్నామన్నారు. తిరువీధుల్లో గురువారం రాత్రి నుంచి వాహనాలను అనుమతించట్లేదు. ట్రాఫిక్‌ను మళ్లించారు. హిందూపురం, బెంగళూరు నుంచి వచ్చే బస్సులను అగ్రికల్చర్ కార్యాలయం వరకు మాత్రమే అనుమతిస్తారు. ఇతర వాహనాలు ఎంపీడీఓ కార్యాలయం నుంచి కొత్త బైపాస్ మీదుగా వెళ్లడానికి ఏర్పాటు చేశారు. పట్టణంలో ద్విచక్రవాహనాలను టవర్‌క్లాక్ వరకే అనుమతిస్తున్నారు. ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ఆలయంలో సొంత ఖర్చుతో ప్రత్యేకాలంకరణ చేయించారు. ఏర్పాట్లపై ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్.. గురువారం ఆలయంలోని కల్యాణమండపంలో సమీక్షించారు. తోపులాటలకు అవకాశం ఇవ్వకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు.

వైకుంఠ ఏకాదశికి పటిష్ట బందోబస్తు: ఎస్పీ రత్న

పుట్టపర్తిరూరల్: వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని జిల్లాలోని అన్ని దేవాలయాల వద్ద పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్పీ రత్న పేర్కొన్నారు. పుట్టపర్తిలోని జిల్లా పోలీసు కార్యాలయం (డీపీఓ)లో గురువారం ఎస్పీ మాట్లాడుతూ.. దేవాలయాలు, పరిసరప్రాంతాల్లో అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా పటిష్ఠ బందోబస్తు చర్యలు చేపట్టాలని పోలీసులకు ఆదేశాలు జారీ చేశామన్నారు. డ్రోన్ కెమెరాలతో ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. అంతకుముందు కదిరి లక్ష్మీనరసింహ స్వామి ఆలయం వద్ద ఏర్పాట్లను ఎస్పీ పరిశీలించారు. పోలీసు అధికారులకు పలు సూచనలు ఇచ్చారు.



క్యూలైన్ల వద్ద ఏర్పాట్లను పరిశీలించి, సిబ్బందికి సూచనలు చేస్తున్న ఎస్పీ రత్న

1668 మందికి ఉద్యోగాలు

ధర్మవరం, జనవరి 9(ఆంధ్రజ్యోతి): స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆధ్వర్యంలో స్థానిక సీఎస్‌బీ కల్యాణమండపంలో గురువారం నిర్వహించిన మెగా జాబ్‌మేళాకు విశేష స్పందన లభించింది. 1668 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. 99 కంపెనీల ప్రతినిధులు.. యువతీయువకులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. నియోజకవర్గం నుంచి 5121 మంది హాజరుకాగా.. 1668 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి హరికృష్ణ, బీజేపీ కార్యాలయ ఇన్‌చార్జి హరీశ్‌బాబు, నాయకులు పాల్గొన్నారు.



ఉద్యోగాలకు ఎంపికైన యువతీ యువకులు

రేపు సత్యసాయి విద్యార్థుల స్పోర్ట్స్‌మీట్

పుట్టపర్తి, జనవరి 9(ఆంధ్రజ్యోతి): సత్యసాయి విద్యార్థుల స్పోర్ట్స్‌మీట్ ఈనెల 11వ తేదీన నిర్వహించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. స్థానిక హిల్‌వ్యూ స్టేడియంలో ఉదయం 8 గంటలకు స్పోర్ట్స్‌మీట్ ప్రారంభమవుతుంది. ప్రశాంతినిలయం, అనంతపురం మహిళా కాలేజ్, కర్ణాటకలోని బృందావనం, ముద్దనహళ్లి క్యాంపస్ విద్యార్థులు పాల్గొంటారు. వివిధ రకాల విన్యాసాలతోపాటు భారతీయ సంస్కృతి ఉట్టిపడేలా కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఇందు కోసం నెలరోజులుగా విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు.

52 భవనాలకు నోటీసులు

పుట్టపర్తి, జనవరి 9(ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని 52 భవనాలకు నోటీసులు జారీ చేసినట్లు మున్సిపల్ కమిషనర్ ప్రహల్లాద గురువారం ప్రకటనలో పేర్కొన్నారు. నిబంధనలకు విరుద్ధంగా భవనాలు నిర్మించడం, ఎయిర్‌పోర్టు అనుమతులు లేకపోవడం, ఖాళీస్థలాలకు పన్ను చెల్లించకుండా భవనాలు నిర్మించిన యజమానులకు నోటీసులు జారీ చేశామన్నారు. దీనిపై సకాలంలో స్పందించని బిల్డర్లపై కోర్టులో చార్జిషీటు దాఖలు చేయనున్నట్లు కమిషనర్ తెలిపారు. ఇంకా నిబంధనలు అతిక్రమించి చేపట్టిన నిర్మాణాలకు నోటీసులు అందజేయనున్నట్లు వివరించారు.



బీరువాలోని చీరలను చిందరవందరగా పడేసిన దొంగలు (ఫైల్)

ఇల్లు జాగ్రత్త..!

- సంక్రాంతి వేళ దొంగలు చెలరేగే ప్రమాదం
- సెలవులకు ఊరెళ్లేవారు ప్రత్యేక ఏర్పాట్లు చేసుకోవాలి
- సీసీ కెమెరాలు, సెంట్రల్ లాక్ బిగించుకోవాలంటున్న పోలీసులు

ధర్మవరం, జనవరి 9(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ వచ్చిందంటే అంతటా సందడే సందడి. విద్యాసంస్థలకు సెలవులు వదులుతారు. పండుగకు చాలామంది పల్లెల బాట పడతారు. కొందరు సొంతూళ్లు, బంధువుల ఇళ్లకెళ్తారు. ఇంకొందరు విహారయాత్రలు, పుణ్యక్షేత్రాలకు వెళ్తుంటారు. ఇంటికి తాళం వేసి, అందరూ ఆనందంగా బయల్దేరుతుంటారు. ఇదే సమయంలో కష్టపడి కూడబెట్టుకున్న నగలు, డబ్బు జాగ్రత్త అంటున్నారు పోలీసులు. సెలవుల వేళ దొంగలు చెలరేగిపోయే అవకాశం ఉందంటున్నారు. జాగ్రత్తలు తీసుకోకపోతే.. తాళం వేసిన ఇంటిని గుల్ల చేసేస్తారని హెచ్చరిస్తున్నారు. గతంలో సెలవుల్లో దొంగలు చాలా చోరీలకు పాల్పడ్డారు. జాగ్రత్తలు తీసుకోక కొందరు తీవ్రంగా నష్టపోయారు. తాళాలు వేసిన ఇళ్లను లక్ష్యంగా చేసుకుని దొంగలు చోరీలు చేస్తుంటారు. ఉదయం రెక్కీ నిర్వహించి, రాత్రి చోరీలకు పాల్పడే ముఠాలు సంచరిస్తుంటాయి. ఏమాత్రం నిర్లక్ష్యం చేసినా ఇల్లు గుల్లయ్యే అవకాశం ఉందని పోలీసులు హెచ్చరిస్తున్నారు.

అమలులోలేని ఎల్‌హెచ్‌ఎంఎస్

ఇంటికి తాళం వేసి ఊరెళ్లే వారి కోసం గతంలో పోలీసు శాఖ తాళం వేసిన ఇళ్ల పర్యవేక్షణ వ్యవస్థ (ఎల్‌హెచ్‌ఎంఎస్)ను అమలులోకి తెచ్చింది. ఊరెళ్లేవారు సంబంధిత పోలీసు స్టేషన్‌లో సమాచారం ఇస్తే.. వారి ఇంటి భద్రత బాధ్యతను పోలీసులు చూసుకునేవారు. ఆ మేరకు ప్రత్యేక కెమెరాలు బిగించుకునేవారు. నిఘా ఉంచేవారు. ఎల్‌హెచ్‌ఎంఎస్‌కు ప్రజల నుంచి స్పందన కరువవ్వడంతో ప్రస్తుతం అమలులో లేదని పోలీసు వర్గాలు పేర్కొంటున్నాయి.

ఊరెళ్లేవారు తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- బంగారు, వెండి ఆభరణాలు, నగదు విలువైన వస్తువులను బ్యాంకు లాకర్‌లో జమ చేసుకోవాలి.
- ప్రధాన ద్వారాలకు సెంట్రల్ లాక్ సిస్టమ్‌తోపాటు సెక్యూరిటీ అలారం, మోషన్ సెన్సార్లు ఏర్పాటు చేసుకోవాలి.
- ఊరెళ్లే ముందు స్థానిక పోలీసు స్టేషన్‌లో సమాచారం ఇస్తే నిఘా ఉంటుంది.
- అనుమానాస్పద వ్యక్తుల సంచారాన్ని గమనిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలి.
- సీసీ కెమెరాలను అమర్చుకుని, ఫుటేజీలను తరచూ ఆన్‌లైన్‌లో చూసుకుంటూ ఉండాలి.
- ప్రధాన ద్వారానికి తాళాలు వేసిన విషయం కనిపించకుండా కర్టెన్లు బిగించాలి.
- ఊరు వెళ్లిన విషయాన్ని ఎవరితోనూ పంచుకోకూడదు.
- నమ్మకమైన కాపలాదారులను పెట్టుకోవాలి. వారి వివరాలు తీసుకోవాలి.



తాళాలు వేసిన ఇళ్లే టార్గెట్

చోరీలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. ప్రతిఒక్కరూ గృహాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి. ఇంటికి తాళం వేసి ఊరు వెళ్లే వారికి సమాచారం ఇవ్వడం ద్వారా ఆ గృహాలపై పోలీసుల పర్యవేక్షణ ఉంటుంది. రాత్రివేళ గస్తీ, తనిఖీలు ముమ్మరం చేస్తాం. అనుమానిత వ్యక్తులు సంచరిస్తే పోలీసులకు సమాచారం అందించాలి.

- నాగేంద్రప్రసాద్, సీఐ, ధర్మవరం వన్‌టౌన్

ప్రత్యేక నిధులు ఇవ్వండి: అంబికా

అనంతపురం అర్బన్, జనవరి 9(ఆంధ్రజ్యోతి): పట్టుపరిశ్రమల అభివృద్ధి కోసం రాష్ట్రానికి ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని సెంట్రల్ సిల్క్ బోర్డు వైస్ ఛైర్మన్, బోర్డు సభ్యులకు అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ విన్నవించారు. బెంగుళూరులో గురువారం సెంట్రల్ సిల్క్ బోర్డు సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ఎంపీ అంబికా హాజరయ్యారు. ఏపీలో పట్టు పరిశ్రమ అభివృద్ధి కోసం పలు ప్రతిపాదనలు చేశారు. ఆయా అంశాలపై సిల్క్ బోర్డు వైస్ ఛైర్మన్‌కు వినతి పత్రం అందజేశారు. పట్టు రైతులకు ఇన్సెంటీవ్‌లు అందించేలా చూడాలని కోరారు. రీలింగ్ యూనిట్‌లకు జీఎస్టీని రద్దు చేయాలని, రేకుల షెడ్డు నిర్మాణ నిధులను రూ.4.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచాలని విన్నవించారు. హిందూపురం పట్టు గూళ్ల మార్కెట్‌కు రూ.8 కోట్లు, పలమనేరు పట్టుగూళ్ల మార్కెట్‌కు రూ.5 కోట్లు మంజూరు చేయాలని కోరారు.



వినతిపత్రం అందజేస్తున్న ఎంపీ అంబికా

నారు మళ్లు..
నీటి కయ్యలు..
దమ్ముచేసిన భూములు..
చెక్కిన గెనాలు..
చేను నిండా జనాలు..
బీళ్లకు పండగొచ్చింది..

ఎక్కడికెళ్లారో ఇన్నినాళ్లు..
ఏడ ఉన్నారో ఇన్నేళ్లు..
మళ్లీ వచ్చారు..
అనుకోని అతిథులు..
తెల్లతెల్లాని కొంగలు..
దమ్ముచేసిన చేలల్లో..
గుంపులుగుంపులుగా చేరి..
గుసగుసలాడుకుంటున్నారు..
రైతులతో.. ఊసులాడుతున్నారు..
నేస్తాలై..

ప్రకృతి పరవశం


తవళం ఆంజనేయస్వామి గుడి వద్ద పొలాల్లో కొంగల గుంపులు

నిన్నటిదాకా అవన్నీ బీడుభూములు. బీడుబారిపోయిన భూములు. జలం పొంగింది. బీళ్లను తడిపింది. అన్నదాతల్లో ఉత్సాహం నింపింది. ఆనందంగా పంటల సాగుకు శ్రీకారం చుట్టారు. తనకల్లు మండలంలోని చెన్నరాయస్వామి గుడి (సీజీ) ప్రాజెక్టు ఖరీఫ్‌లో పూర్తిగా నిండిపోయింది. ఆయకట్టుకు నీరు వదిలారు. దీంతో రైతులు వరి విస్తారంగా సాగుచేస్తున్నారు. అందుకు భూములను దమ్ము చేసుకుని, వరి నాట్లకు సిద్ధం చేసుకున్నారు. ఎక్కడి నుంచో కొంగల గుంపులు వచ్చి చేరాయి. భూమిలో నుంచి వచ్చే పురుగులను తింటూ రోజంతా భూముల్లోనే ఉంటున్నాయి. ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. తనకల్లు మండలంలోని తవళం గ్రామం వద్ద ఆంజనేయస్వామి ఆలయ సమీపాన భూముల్లో కొంగల గుంపులు చేరాయి. వాటిని చూసి జనం మైమరచిపోతున్నారు.

-తనకల్లు(ఆంధ్రజ్యోతి)









సంక్రాంతికి వస్తున్నాం..!

బడి నుంచి విద్యార్థుల ఊరి బాట

ఊరికి, ఇంటికి దూరంగా వచ్చేసిన బడి పిల్లలకు ఒక్కసారిగి రెక్కలు వచ్చాయి. సంచులు సర్దుకుని హాస్టల్ గదుల నుంచి రివ్వున గూటికి ఎగిరిపోయాయి. బస్సులో సీటు దొకగానే.. 'సంక్రాంతికి వస్తున్నాం..' అని తల్లిదండ్రులు, స్నేహితులకు సందేశం పంపించారు. ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలకు శుక్రవారం నుంచి ఈ నెల 19వ తేదీ వరకు ప్రభుత్వం సంక్రాంతి సెలవులు ప్రకటించింది. దీంతో పండుగ కోసం ఊళ్లకు వెళ్లేవారితో జిల్లా వ్యాప్తంగా బస్టాండులన్నీ కిటకిటలాడాయి. బస్సు కనిపించగానే పరుగున వెళ్లి చుట్టుముట్టేశారు. కిటికీల నుంచి జేబు రుమాలు, సంచులు సీట్లలోకి విసిరేసి 'సంప్రదాయ రిజర్వేషన్' చేసేసుకున్నారు. మధ్యాహ్నం నుంచి రాత్రి వరకూ రద్దీ కొనసాగింది. పండుగ నేపథ్యంలో ఆర్టీసీ అధికారులు రీజియన్‌లోని 7 డిపోల నుంచి 266 స్పెషల్ బస్సు సర్వీసులను వివిధ ప్రాంతాలకు నడుపుతున్నారు. అయినా, విద్యార్థులు, వారిని తీసుకెళ్లేందుకు వచ్చిన తల్లిదండ్రులు, సాధారణ ప్రయాణికుల రద్దీకి అవి సరిపడలేదు.



ఊర్లకు వెళ్లేందుకు అనంతపురం బస్టాండుకు చేరుకుంటున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులు

- ఆంధ్రజ్యోతి, అనంతపురం కల్చరల్



సంక్రాంతికి స్పెషల్ రైళ్లు



గుంతకల్లు, జనవరి 9(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగను పురస్కరించుకుని గుంతకల్లు మీదుగా ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు రైల్వే అధికారులు గురువారం తెలిపారు. సికింద్రాబాద్-అరిసికెరె (నంబరు 07231) ప్రత్యేక రైలు ఈ నెల 10వ తేదీ సాయంత్రం 7-05 గంటలకు సికింద్రాబాద్‌లో బయలుదేరి, మరుసటి రోజు మధ్యాహ్నం ఒంటి గంటకు అరిసికెరెకు చేరుకుంటుంది. దీని తిరుగు ప్రయాణపు రైలు (నంబరు 07232) అరిసికెరెలో ఈ నెల 11న మధ్యాహ్నం 2 గంటలకు బయలుదేరి మరుసటిరోజు ఉదయం ఏడున్నరకు సికింద్రాబాద్‌కు చేరుకుంటుంది. సికింద్రాబాద్-అరిసికెరె (నంబరు 07233) ప్రత్యేక రైలు ఈ నెల 12వ తేదీ సాయంత్రం 7-05 గంటలకు సికింద్రాబాద్‌లో బయలుదేరి మరుసటి రోజు మధ్యాహ్నం ఒంటి గంటకు అరిసికెరెకు చేరుకుంటుంది. దీని తిరుగు ప్రయాణపు రైలు (నంబరు 07234) అరిసికెరెలో ఈనెల 11న మధ్యాహ్నం 2 గంటలకు బయలుదేరి మరుసటిరోజు ఉదయం 8 గంటలకు సికింద్రాబాద్‌కు చేరుకుంటుంది. ఈ రెండు రైళ్లు లింగంపల్లి, వికారాబాద్, సేడం, క్రిష్ణ, రాయచూరు, మంత్రాలయం రోడ్డు, ఆదోని, గుంతకల్లు, అనంతపురం, ధర్మవరం, హిందూపురం, యలహంక, చిక్‌బనవ్వూర్, తుమకూరు స్టేషన్ల మీదుగా ప్రయాణిస్తాయి. ఎస్ఎంవీటీ బెంగళూరు-కలబురగి (నంబరు 06519) ప్రత్యేక రైలు ఈ నెల 10, 11, 12 తేదీల్లో ఎస్ఎంవీటీ బెంగళూరు స్టేషన్‌లో రాత్రి 9-15 గంటలకు బయలుదేరి, మరుసటిరోజు ఉదయం 7-40 గంటలకు కలబురగికి చేరుకుంటుంది. దీని తిరుగు ప్రయాణపు రైలు (నంబరు 06520) కలబురగిలో ఈ నెల 11, 12, 13 తేదీల్లో ఉదయం 9-35 గంటలకు బయలుదేరి ఆయా రోజుల్లో రాత్రి 8 గంటలకు ఎస్ఎంవీటీ బెంగళూరు స్టేషన్‌కు చేరుకుంది. ఈ రైలు యలహంక, ధర్మవరం, అనంతపురం, గుంతకల్లు, ఆదోని, మంత్రాలయం రోడ్డు, రాయచూరు, క్రిష్ణ, యాద్గిర్, షాహాబాద్ స్టేషన్ల మీదుగా ప్రయాణిస్తుంది.

హంసఫర్ ఎక్స్‌ప్రెస్ మరో 7 వారాలు రద్దు

గుంతకల్లు, జనవరి 9(ఆంధ్రజ్యోతి): గుంతకల్లు మీదుగా వెళ్లే తిరుపతి-జమ్మూతావి-తిరుపతి హంసఫర్ వీక్లీ ఎక్స్‌ప్రెస్ రైలు రద్దును మరో ఏడు వారాలపాటు కొనసాగిస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. ఉత్తర రైల్వే జోన్‌లోని జమ్మూ రైల్వే స్టేషన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనుల కారణంగా ఒక అప్ అండ్ డౌన్ ట్రిప్పు రైలును ఈనెల 7, 10 తేదీల్లో రద్దుచేశారు. పనులు పూర్తికానందున మరో ఏడు వారాలపాటు సర్వీసుల రద్దును కొనసాగించాలని నిర్ణయించారు. తిరుపతి-జమ్మూతావి ఎక్స్‌ప్రెస్ (నంబరు 22705) రైలును ఈ నెల 14, 21, 28, ఫిబ్రవరి 4, 11, 18, 25 తేదీల్లో, దీని తిరుగు ప్రయాణపు రైలును (నంబరు 22706) ఈనెల 17, 24, 31, ఫిబ్రవరి 7, 14, 21, 28 తేదీల్లో రద్దు చేశారు.

కత్తి కల్చర్..!

పురంలో వరుస కత్తిపోట్ల ఘటనలు
కత్తి దగ్గర పెట్టుకుని తిరుగుతున్న కొందరు
బెంబేలెత్తుతున్న జనం



హిందూపురం, జనవరి 9(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ పాలన పుణ్యమాని పట్టణానికి కొత్త సంస్కృతి వచ్చిపడింది. ప్రశాంతతకు మారుపేరైన హిందూపురంలో కత్తి కల్చర్ పురుడు పోసుకుంది. కొందరు కత్తులను దగ్గర పెట్టుకుని, తిరుగుతున్నారు. ఇటీవలిగా వరుస కత్తిపోట్ల ఘటనలే ఇందుకు నిదర్శనం. మండలంలో ఏడాది క్రితం రాత్రిపూట ద్విచక్రవాహనంలో వస్తున్న వ్యక్తిని దుండగులు అడ్డగించారు. అతడి వద్దనున్న డబ్బు, వాహనాన్ని లాక్కుని, గొంతుకోసి వెళ్లిపోయారు. తీవ్ర గాయాలతో పడి ఉన్న అతడిని అటుగా వెళ్తున్నవారు గమనించి, పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఆస్పత్రికి తరలించి చికిత్సలు అందించారు.

మారని తీరు..

గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ఇక్కడ పనిచేసిన పోలీసు అధికారులు అధిక శాతం సమయం వైసీపీ నాయకుల సేవలో తరించడానికి సరిపోయింది. నేరం జరిగినా పోలీసులు చూసీచూడనట్లు వ్యవహరించారు. దీంతో నేరస్థులు చెలరేగిపోయారు. ఈ పరిస్థితుల్లో కూటమి ప్రభుత్వం ఏర్పడినా కొంతమంది నేరస్థుల్లో భయంలేకుండా పోయింది. వారం క్రితం రౌడీషీటర్‌గా ఉన్న వ్యక్తి ఓ ఇంటి అద్దాలు పగులకొట్టాడు. మరో రౌడీషీటర్‌కు భయపడి నిందితుడిపై కేసు కట్టడానికి పోలీసులు నిరాకరించారు. దీంతో బాధితులు రోడ్డెక్కి ధర్నా చేయాల్సిన పరిస్థితి వచ్చింది. దీనిని బట్టి ఇప్పుడు కూడా నేరస్థులు ఎంతగా రెచ్చిపోతున్నారో అర్థమవుతోంది.

ఆత్మరక్షణ కోసం చిన్నపాటి కత్తులు

ఎన్నడూలేని విధంగా హిందూపురంలో ఒక వర్గానికి చెందినవారు ఆత్మరక్షణ కోసం చిన్నపాటి కత్తులు ఉంచుకుంటున్నట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. పట్టణంలో ఐదు కత్తిపోట్ల ఉదంతాలు వెలుగు చూడగా.. అందులో ఇరువైపులా తొమ్మిదిమంది గాయపడ్డారు. కత్తి దాడుల నేపథ్యంలో జనం బెంబేలెత్తుతున్నారు. కత్తులతో సయ్యాట ఎక్కడికి దారితీస్తుందోనని పట్టణవాసులు భయపడుతున్నారు. వారం క్రితం ఆర్టీసీ కాలనీలో జరిగిన ఘటనను పరిశీలిస్తే అతడు నిత్యం కత్తి దగ్గర పెట్టుకుని తిరుగుతున్నట్లు పోలీసులే చెప్పడం గమనార్హం. హిందూపురంలో ఇంకెంతమంది కత్తులు పెట్టుకుని తిరుగుతున్నారోనన్న ఆందోళన ప్రజల్లో నెలకొంది. కత్తి కల్చర్ మంచిదికాదనీ, వెంటనే అరికట్టాలని జనం కోరుతున్నారు.

ఇటీవల కత్తిపోట్ల ఘటనలు ఇవీ..

- నాలుగు నెలల క్రితం మోతుకపల్లి వద్ద ఇద్దరు స్నేహితులు గంజాయి మత్తులో కత్తితో పొడుచుకున్నారు. కత్తితో గొంతు కోయడానికి సైతం ప్రయత్నించారు.
- ఇటీవల హిందూపురం వన్‌టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తికి గొంతు కోయడంతో తీవ్ర రక్తస్రావమై, ఆస్పత్రి పాలయ్యాడు.
- పట్టణంలోని రహమత్‌పురంలో ఇటీవల మూడు నెలల వ్యవధిలో మూడు ఘటనలు జరిగాయి. కత్తులతో గొంతు కోసుకుని, పొత్తి కడుపులో పొడుచుకుని తీవ్రగాయాలతో ఆస్పత్రుల పాలయ్యారు.
- తాజాగా ఆర్టీసీ కాలనీలో ఇలాంటి ఘటన జరిగింది. ఈనెల 7న అర్ధరాత్రి హిందూపురం-లేపాక్షి ప్రధాన రహదారిలోని కొల్లకుంట చెరువు కట్టకింద ముద్దిరెడ్డిపల్లి ప్రాంతానికి చెందిన వ్యక్తిని గొంతుకోసి హత్య చేయడానికి ప్రయత్నించారు. ఇవి మచ్చుకు మాత్రమే. గత ఐదేళ్లలో ఇలాంటివి చాలానే జరిగాయి.

టమోటా కిలో రూ.11

అనంతపురం రూరల్, జనవరి 9(ఆంధ్రజ్యోతి): స్థానిక కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.11తో అమ్ముడు పోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు గురువారం 630 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ.9, కనిష్ఠ ధర రూ.7 పలికినట్లు ఆయన తెలిపారు.

సదరం క్యాంపులు రద్దు

అనంతపురం టౌన్, జనవరి 9(ఆంధ్రజ్యోతి): జిల్లా సర్వజన ఆస్పత్రిలో సదరం మెడికల్ క్యాంపుల నిర్వహణను తాత్కాలికంగా రద్దు చేశామని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు గురువారం తెలిపారు. పింఛన్లకు సంబంధించిన వైకల్య మెడికల్ సర్టిఫికెట్ల జారీ కోసం వారానికి మూడురోజులు సదరం మెడికల్ క్యాంపులను ఆస్పత్రిలో నిర్వహించామని, ఇప్పటి వరకూ మంజూరు చేసిన సర్టిఫికెట్ల రీ వెరిఫికేషన్ జరుగుతోందని తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు కొత్త వైకల్య మెడికల్ సర్టిఫికెట్ల జారీని నిలిపేశామని ఆయన తెలిపారు. ప్రభుత్వం నుంచి మళ్లీ ఆదేశాలు వచ్చిన తర్వాత తిరిగి సదరం మెడికల్ క్యాంపులు నిర్వహిస్తామని తెలిపారు. అప్పటివరకూ ఎవరూ సదరం సర్టిఫికెట్ల కోసం ఆస్పత్రికి రావద్దని సూచించారు.

గొర్రెల మందపై దూసుకెళ్లిన
ఆయిల్ ట్యాంకర్
13 గొర్రెల మృతి.. కాపరి పరిస్థితి విషమం


ప్రమాదంలో మృతిచెందిన గొర్రెలు

బత్తలపల్లి, జనవరి9(ఆంధ్రజ్యోతి): మండలంలోని జ్వాలాపురం స్టేజ్ సమీపాన గురువారం గొర్రెల మందపై ఆయిల్ ట్యాంకర్ దూసుకెళ్లడంతో 13 జీవాలు మరణించగా.. కాపరి తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని కోడేకండ్ల గ్రామానికి చెందిన ఓబుళపతి గొర్రెలు మేపుకుంటూ జీవనం సాగించేవాడు. దినచర్యలో భాగంగా గురువారం గొర్రెలను మేపునకు తోలుకెళ్లాడు. జ్వాలాపురం స్టేజ్ సమీపాన గొర్రెలు రోడ్డు దాటుతుండగా ఆయిల్ ట్యాంకర్ వాటిపై దూసుకెళ్లింది. ప్రమాదంలో 13 గొర్రెలు మృతిచెందాయి. కాపరి ఓబుళపతి తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని అటుగా వెళ్లే వాహనదారులు 108 సాయంతో ఆర్డీటీ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో అనంతపురం తీసుకెళ్లారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ సోమశేఖర్ ప్రమాద స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నారు. ఆయిల్ ట్యాంకర్ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

వ్యవసాయ శాఖ మంత్రి ఆరా

ప్రమాద విషయం తెలుసుకున్న రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు ఆరా తీశారు. గాయపడిన గొర్రెల కాపరికి మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. గొర్రెల కాపరి కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. ప్రమాదంపై నివేదిక ఇవ్వాలని పశుసంవర్థక శాఖాధికారులను మంత్రి ఆదేశించారు.

ఆశా కార్యకర్త అనుమానాస్పద మృతి


నసీమా (ఫైల్)

హిందూపురం, జనవరి 9(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మోడల్ కాలనీలో ఆశా కార్యకర్త నసీమా (40) బుధవారం అర్ధరాత్రి సమయంలో ఇంట్లోనే అనుమానాస్పద స్థితిలో మరణించినట్లు టూటౌన్ సీఐ అబ్దుల్ కరీం తెలిపారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నసీమా 12ఏళ్ల క్రితం భర్త నుంచి విడిపోయి మేళాపురంలో నివాసముండేది. మోడల్ కాలనీకి చెందిన హైదర్‌తో పరిచయం ఏర్పడి, తరువాత అతడితో సహజీవనం చేస్తుండేది. హైదర్‌కు భార్య ఉంది. అందరూ కలిసి ఒకే ఇంట్లో ఉంటున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం అర్ధరాత్రి దాటాక నసీమా ఇంటి పైకప్పునకు ఉరివేసుకుంది. ఉదయం హైదర్ నిద్రలేచి చూడగా.. నసీమా ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించింది. మృతదేహాన్ని కిందకు దించి, పోలీసులకు సమాచారం ఇచ్చాడు. రూరల్ పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి, మృతదేహాన్ని హిందూపురం ఆస్పత్రికి తరలించారు. నసీమాకు ఇద్దరు కుమారులున్నారు. పెద్ద కుమారుడు తబ్రేజ్.. తన తల్లిని హైదర్ చంపి ఆత్మహత్యగా చిత్రీకరించాడని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశామని సీఐ అబ్దుల్ కరీం తెలిపారు.

యువతి పట్ల అసభ్య ప్రవర్తన

మగ్గాల నిర్వాహకుడిపై కేసు

ధర్మవరం, జనవరి 9(ఆంధ్రజ్యోతి): కడపజిల్లా జమ్మలమడుగుకు చెందిన ఓ యువతి పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన పట్టణానికి చెందిన చేనేత మగ్గాల నిర్వాహకుడు ఆదిశేషుపై కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ సీఐ నాగేంద్రప్రసాద్ గురువారం తెలిపారు. జమ్మలమడుగుకు చెందిన హసీనాతో ఆదిశేషుకు సోషల్ మీడియాలో పరిచయం ఏర్పడింది. ధర్మవరంలో తనకు డబ్బు ఇవ్వాలని ఆమె.. ఆదిశేషుతో చెప్పింది. తాను పోలీసునని, డబ్బు ఇప్పిస్తానని అతడు నమ్మబలికాడు. కారులో జమ్మలమడుగుకు వెళ్లి ఆమెను పిలుచుకుని ఈనెల 8న ధర్మవరం వచ్చాడు. పట్టణ సమీపంలో ఆమె పట్ల అసభ్యంగా ప్రవర్తించాడు. దీంతో ఆమె వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆ మేరకు ఆదిశేషుపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

చేలపై డ్రోన్లు..!

సాంకేతికతకు కూటమి ప్రభుత్వం పెద్దపీట

- జిల్లాకు 35 కిసాన్ డ్రోన్ల మంజూరు
- 80 శాతం రాయితీ వర్తింపు
- గత వైసీపీ పాలనలో ఒక్కటీ అందని వైనం

ధర్మవరం, జనవరి 9(ఆంధ్రజ్యోతి): వ్యవసాయానికి పెద్దపీట వేస్తాం, యాంత్రీకరణ పద్ధతి ద్వారా వ్యవసాయం రూపురేఖలు మారుస్తామంటూ గత వైసీపీ ప్రభుత్వ పెద్దలు.. సభలు, సమావేశాలలో ఊదరగొట్టారు. మరో అడుగు ముందుకేసి కిసాన్ డ్రోన్లను రైతులకు అందిస్తామని సాక్ష్యాత్తు అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ కోతలు కోశారు. ఐదేళ్లలో ఒక్కటంటే ఒక్కటి కూడా రైతులకు చేరువకాలేదు. 2024లో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం గత వైసీపీ పాలనలో వ్యవసాయానికి జరిగిన నష్టాలను పూడ్చే పనిలో నిమగ్నమైంది. అందులో డ్రిప్, స్ప్రింక్లర్ల పరికాలను తొలి విడత కింద సబ్సిడీతో మంజూరు చేస్తోంది. వ్యవసాయానికి సాంకేతిక పరిజ్ఞానం జోడిస్తూ కూటమి ప్రభుత్వం కిసాన్ డ్రోన్లను సబ్సిడీ కింద అందజేసేందుకు శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా శ్రీసత్యసాయి జిల్లాకు 35 కిసాన్ డ్రోన్లను పైలెట్ ప్రాజెక్టు కింద తొలి విడతలో మంజూరు చేసింది.

కిసాన్ డ్రోన్లు పొందవచ్చు ఇలా..

భూములున్న రైతులు ఈ పథకానికి అర్హులు. 2.50 ఎకరాలకుపైగా భూమి ఉండాలి. ఐదు నుంచి పది మంది రైతులు కమిటీగా ఏర్పడాలి. డ్రోన్ ఆపరేటర్‌కు 18 ఏళ్ల నుంచి 45 ఏళ్ల వయసు ఉండాలి. మెడికల్ ఫిట్‌నెస్ తప్పనిసరి. పదో తరగతి ఉత్తీర్ణులై ఉండాలి. వారికి అమరావతిలోని ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో 12 రోజులపాటు కిసాన్ డ్రోన్ ఆపరేటింగ్‌పై శిక్షణ ఇస్తారు. అనంతరం వారికి ప్రభుత్వం పైలెట్ లైసెన్స్ అందజేస్తుంది. కిసాన్ డ్రోన్ ఆపరేటింగ్, మెకానిజంపై శిక్షణ ఇస్తారు.

సబ్సిడీతో పంపిణీ

కిసాన్ డ్రోన్లను సబ్సిడీతో పంపిణీ చేయనున్నట్లు వ్యవసాయాధికారులు చెబుతున్నారు. ప్రస్తుతానికి యూనిట్ ధర రూ.10 లక్షలుగా నిర్ణయించారు. ఇందులో 80 శాతం అంటే రూ.8 లక్షలు సబ్సిడీ వర్తింపజేస్తారు. మిగిలిన రైతులు తమ వాటాగా చెల్లించాల్సి ఉంటుంది. కిసాన్ డ్రోన్‌కు సంబంధించి అదనంగా నాలుగు బ్యాటరీలు, రెండు చార్జర్లు, నాలుగు నాజిల్స్, రెండు ల్యాండింగ్ గేర్స్, అదనపు ప్రొఫయిలర్స్ ఒక సెట్ (6), టూల్‌కిట్ 1, ఏడాదికి డ్రోన్‌కు వారెంటీ అందుతాయి.



మహిళలకు నమో డ్రోన్ పథకం

మహిళలను వ్యవసాయ రంగంలో కూడా భాగస్వాములను చేయాలన్న ఉద్దేశంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నమో డ్రోన్ పథకాన్ని అమలు చేస్తున్నాయి. శ్రీసత్యసాయి జిల్లాలో డీఆర్‌డీఏ ద్వారా ఆరుగురు మహిళలను ఎంపిక చేస్తామని జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు తెలిపారు. దరఖాస్తులను పరిశీలించి, ఎంపిక చేస్తామన్నారు. అందులో డ్రోన్ పైలెట్ ట్రైనీని ఎంపిక చేసి, డ్రోన్ ఆపరేటింగ్ శిక్షణ కోసం అమరావతిలోని ఎన్‌జీ రంగా విశ్వవిద్యాలయానికి పంపుతామన్నారు. అక్కడ శిక్షణ ఇచ్చి పైలెట్ లైసెన్స్ అందజేస్తారన్నారు.



రైతు రాశిగా పోసిన టమోటాలు

ధర పతనం

ఆందోళనలో టమోటా రైతు

పెట్టుబడులు తిరిగిరాక ఇబ్బందులు.. పొలాల్లోనే వదిలేస్తున్న వైనం

టమోటా సాగు చేసిన రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ధరలు ఎప్పుడు పెరుగుతాయో, ఎప్పుడు పతనమవుతాయో అర్థంకాని పరిస్థితిలో ఉన్నారు. మండలవ్యాప్తంగా యాడికి, రాయలచెరువు, లక్షుంపల్లి, కేశవరాయునిపేట, వెంగన్నపల్లి తదితర గ్రామాల్లో 150 ఎకరాల్లో రైతులు టమోటా పంట సాగుచేశారు. మూడు నెలల క్రితం కిలో ధర రూ. 70 పలికినా నేడు రూ.10 కూడా లేదు. దీంతో రైతులు అప్పుల పాలు కావాల్సి వస్తోంది. దిగుబడి ఆశాజనకంగా ఉన్నా మార్కెట్‌లో ధర లేకపోవడంతో పంటను పొలాల్లోనే వదిలే స్తున్నట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలోని మార్కెట్లలో ధరలు పలకడం లేదని సమీప జిల్లాలైన కర్నూలు, కడప జిల్లాల్లోని ప్యాపిలి, ప్రొద్దుటూరులోని మార్కెట్లకు తరలిస్తున్నారు. అక్కడా ధరలు లేకపోవడంతో తీవ్రంగా నష్టపోతున్నామని పలువురు రైతులు తెలిపారు.

-ఆంధ్రజ్యోతి, యాడికి

ఇప్పుడు రూ.10 పలకడం కష్టమే

మూడునెలల క్రితం బహిరంగ మార్కెట్‌లో టమోటా ధర కిలో రూ.70 పలికింది, కానీ ఇప్పుడు రూ.10 కూడా లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. టమోటా గ్రేడింగ్ బట్టి బాక్స్ (25కిలోలు) గరిష్ఠంగా రూ. 110, కనిష్ఠంగా రూ. 50 ధర పలుకుతుండడంతో రైతుల పరిస్థితి ఆందోళనకరంగా మారుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో టమోటా సాగు చేసేందుకు ముందుకు రాలేకపోతున్నామని రైతులు అంటు న్నారు. ధర కోసం దూరప్రాంత మార్కెట్లకు తీసుకెళ్లాలంటే రవాణా ఖర్చులు తడిసిమోపెడు అవుతున్నాయని, అలా వెళ్లినా ఒక్కోసారి అక్కడ కూడా ధర పలకక వట్టి చేతులతో తిరిగి వస్తున్నామని వాపోయారు.



విరగ్గాసిన టమోటా

పెట్టుబడులు అధికమే



టమోటా పంట సాగుకు ఎకరాకు సుమారు రూ. 30 వేల నుంచి రూ. 50వేల వరకు ఖర్చు చేస్తున్నారు. సేద్యం పను లు, ఎరువులు, మందులకు ఖర్చు ఎక్కువ అవుతోందని, తెగుళ్ల సోకితే ఖర్చు మరింత పెరుగుతుందని రైతులు తెలుపుతున్నారు. పంట కోయడానికి ఒక్కో కూలీకి రూ. 300 వరకు ఇవ్వాల్సి వస్తోందని, ప్రస్తుత ధరలతో కూలీల ఖర్చు కూడా రావడం లేదంటున్నారు. దీంతో పంటను పొలాల్లోనే వదిలేయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ధర పతనంతో పంటను తొలగింపు



టమోటా ధరలు పూర్తిగా పడిపోవడంతో దైవాలమడుగు, రాయలచెరువు తదితర గ్రామాల్లోని రైతులు పంటను తొలగిస్తున్నారు. పెట్టుబడులు కూడా వచ్చే అవకాశం లేకపోవడంతోనే పంటను తొలగిస్తున్నట్లు రైతులు తెలిపారు. ఎకరాకు రూ. 30వేల నుంచి రూ. 50వేల వరకు పెట్టుబ డులు పెట్టామని, దిగుబడి ఆశాజనకంగా ఉన్నప్పటికి ధరల పతనంతో తీవ్రంగా నష్టపోవాల్సి వస్తోందని తెలిపారు.

దైవాలమడుగులో పంటను తొలగిస్తున్న రైతు

1.5ఎకరాల్లో సాగుచేసి నష్టపోయా..



నేను ఒకటిన్నర ఎకరాలో టమోటా సాగుచేశా. రూ. 60 వేలకు పైగా పెట్టుబడి పెట్టా. దిగుబడి బా గా వచ్చింది. ధరలు లేకపోవడంతో తీవ్రంగా నష్టపోవాల్సి వచ్చింది. బహిరంగ మార్కెట్‌లో ఉన్న ధరలు రైతుల నుంచి కొనేప్పుడు ఉండడం లేదు. ప్రస్తుత తరుణంలో టమోటా సాగు చేసిన రైతులు నష్టాలు చవిచూస్తున్నారు.

-సుధీర్‌రెడ్డి, టమోటా రైతు, దైవాలమడుగు

పంటను తొలగించాల్సి వచ్చింది ..



మూడెకరాల్లో టమోటా సాగు చేశా. దిగుబడి ఆశాజనకంగా వచ్చిం ది. ధరలు మాత్రం పూర్తిగా నిరాశపరుస్తున్నాయి. టమోటా సాగుకు పెట్టిన పెట్టుబడులు కూడా రాలేదు. పంటసాగుకు రూ. లక్షకు పైగా పెట్టుబడి పెట్టా. పెట్టుబడి అంతా నష్టపోవాల్సి వచ్చింది. దీంతో పంటను పూర్తిగా తొలగించేశా. టమోటా రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలి.

- మహేశ్వరరెడ్డి, టమోటా రైతు, దైవాలమడుగు

బాక్స్ రూ.80తో ఇచ్చేశా..



టమోటా ధరలు పూర్తిగా పతనమయ్యాయి. రైతులకు పెట్టుబడి కూడా తిరిగి రావడం లేదు. దీంతో పంట పొలం లోనే వదిలేసా. 25కిలోల బాక్స్‌ను రూ. 80తో ఇచ్చేశా. బహిరంగ మార్కెట్‌లో కిలో టమోటా రూ.10 పలుకుతున్నా రైతుల వద్ద నుంచి రూ.5కు కూడా కొనడం లేదు. ప్రస్తుత పరిస్థితుల్లో టమోటా రైతులకు గడ్డు పరిస్థితి ఎదురవుతోంది.

- శేఖర్, టమోటా రైతు, రాయలచెరువు

డాకు మహరాజ్ రాలేదు..!

తిరుపతి ఘటన నేపథ్యంలో ఈవెంట్ రద్దు



మీడియా సమావేశం నిర్వహిస్తున్న సమయంలో కిందకు పడిపోతున్న బాలకృష్ణ కటౌట్

అనంతపురం/అర్బన్ జనవరి 9(ఆంధ్రజ్యోతి): తిరుపతి ఘటన నేపథ్యంలో అనంతపురంలో గురువారం జరగాల్సిన 'డాకు మహరాజ్' ప్రీ రిలీజ్ ఈవెంట్ రద్దైంది. దీంతో బాలయ్య అభిమానులు నిరాశ చెందారు. హిందూపురం ఎమ్మెల్యే, సినీనటుడు నందమూరి బాలకృష్ణ నటించిన డాకు మహరాజ్ ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. హీరో బాలకృష్ణ సహా చిత్ర యూనిట్ సభ్యులు, మంత్రి నారా లోకేశ్ ఈ కార్యక్రమంలో పాల్గొనాల్సి ఉన్నింది. అధికారికంగా షెడ్యూల్ కూడా ఖరారైంది. వీఐపీ, ఎంఐపీ, జనరల్ ఎంట్రీ పాస్‌లను అభిమానులు, ప్రజలకు జారీ చేశారు. అనూహ్యంగా తిరుపతిలో విషాద ఘటన చోటు చేసుకుంది. దీంతో ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను రద్దు చేసుకున్నారు. ఈ మేరకు స్థానిక ప్రజాప్రతినిధులు, బాలకృష్ణ అభిమానుల సంఘం నాయకులకు చిత్ర యూనిట్ నుంచి సమాచారం అందింది.

కూలిన భారీ కటౌట్

ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించే ప్రాంతంలో ఏర్పాటు చేసిన బాలకృష్ణ భారీ కటౌట్ గురువారం వీచిన గాలులకు కూలిపోయింది. శ్రీనగర్ కాలనీ అయ్యప్పస్వామి ఆలయం సమీపంలో వేదికను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఈవెంట్ రద్దు గురించి బాలకృష్ణ అభిమానుల సంఘం నాయకులతో అనంత అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ మీడియాతో తెలియజేస్తున్న సమయంలో, అక్కడికి సమీపంలో ఉన్న భారీ కటౌట్ గాలికి ఊగింది. దీంతో ప్రమాదం జరుగుతుందని భావించి అక్కడున్న ద్విచక్ర వాహనాలను పక్కకు తీశారు. ఆ తర్వాత కాసేపటికే కటౌట్ కింద పడిపోయింది. అందరూ అప్రమత్తంగా ఉండటంతో ఎలాంటి హానీ జరగలేదు.

నేడు కలెక్టరేట్ వద్ద సీపీఐ ధర్నా

అనంతపురం విద్య, జనవరి 9(ఆంధ్రజ్యోతి): పేదలకు ఇళ్ల స్థలాలు, ఇతర అంశాలపై సీపీఐ ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి జాఫర్ గురువారం తెలిపారు. ఉదయం 11 గంటలకు ధర్నా ఉంటుందని, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ హాజరవుతారని ఆయన తెలిపారు. గ్రామాలలో 3 సెంట్లు, పట్టణాలు, నగరాల్లో 2 సెంట్లు ఇంటి స్థలాలు ఇవ్వాలని, ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు కేటాయించాలని డిమాండ్ చేస్తూ ధర్నా చేస్తున్నామని ఆయన వివరించారు. సీపీఐ శ్రేణులు పెద్ద ఎత్తున హాజరుకావాలని పిలుపునిచ్చారు.

థ్యాంక్యూ బాబూ..!



సీఎం చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న వడ్డెర సంఘం నాయకులు

అనంతపురం అర్బన్, జనవరి 9(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డే ఓబన్న జయంతిని అధికారికంగా నిర్వహించాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంతో వడ్డెర్ల సంఘం నాయకులు సంబరాలు చేసుకున్నారు. నగరంలోని వడ్డెర్ల సంఘం కార్యాలయంలో సీఎం చంద్రబాబు చిత్రపటానికి గురువారం క్షీరాభిషేకం చేశారు.

వడ్డెర్ల సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కుంచెపు వెంకటేష్, టీడీపీ నాయకులు సిమెంట్ పోలన్న తదితరులు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రులు నారా లోకేశ్, సవితకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ నెల 11న వడ్డే ఓబన్న జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించేందుకు జీవో జారీ చేయడం శుభపరిణామమని వారు అన్నారు. వడ్డెరలు వేడుకలలో పాల్గొని వడ్డే ఓబన్న జయంతిని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

రండి.. ప్రమోషన్లు ఇస్తాం: డీఈఓ

అనంతపురం విద్య, జనవరి 9(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని మున్సిపల్, నగరపాలిక పాఠశాలల్లో పనిచేస్తున్న అర్హులకు ఉద్యోగోన్నతి కల్పిస్తామని డీఈఓ ప్రసాద్ బాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రాథమిక పాఠశాల హెచ్ఎం, పాఠశాల సహాయక (తెలుగు, హిందీ, ఉర్దూ) పోస్టులకు ప్రమోషన్లు ఉంటాయని తెలిపారు. 2017 అక్టోబరు 10వతేదీ ముందు, ఆ తర్వాత ఉన్న ఖాళీల వివరాలను, టీచర్ల సీనియారిటీ జాబితాను డీఈఓ బ్లాగ్‌లో ఉంచామని తెలిపారు. సీనియారిటీ జాబితాలోని టీచర్లు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లు, సర్వీస్ రిజిస్టర్లతో శుక్రవారం ఉదయం 11 గంటలకు డీఈఓ కార్యాలయంలో హాజరుకావాలని సూచించారు.

సాయంత్రం సమావేశం

జిల్లాలోని డీవైఈఓలు, ఎంఈఓలు, సమగ్రశిక్ష ప్రాజెక్టు సెక్టోరియల్ అధికారులకు, ప్రతిపాదిక స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులకు శుక్రవారం సాయంత్రం సమావేశం నిర్వహిస్తామని డీఈఓ ప్రసాద్‌బాబు తెలిపారు. అనంతపురం పంగల్ రోడ్డులోని ఆర్డీటీ ఆడిటోరియంలో సాయంతం 4.30 గంటలకు సమావేశం ఉంటుందని తెలిపారు. ప్రతి గ్రామ పంచాయతీలో ఒక మోడల్ స్కూల్ ఏర్పాటు, బోధనా సిబ్బంది పునర్విభజన తదితర అంశాలపై చర్చ ఉంటుందని తెలిపారు.

బాధ్యతలు చేపట్టిన సోషల్ ఫారెస్ట్ డీఎఫ్ఓ



సోషల్ ఫారెస్ట్ డీఎఫ్ఓ చంద్రశేఖర్

అనంతపురం న్యూటౌన్, జనవరి 9(ఆంధ్రజ్యోతి) సోషల్ ఫారెస్ట్ డీఎఫ్ఓగా చంద్రశేఖర్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. నెల్లూరు డీఎఫ్ఓగా ఉన్న ఆయన సాధారణ బదిలీల్లో భాగంగా అనంతపురానికి వచ్చారు. ఒక్క రోజు వచ్చి, మరుసటి రోజే సెలవులో వెళ్లిపోయారు. తిరిగి రెండు రోజుల క్రితం జిల్లాకు వచ్చిన ఆయన, సీఎఫ్ యశోదాబాయిని గురువారం కలిసి జాయినింగ్ రిపోర్ట్ ఇచ్చారు.

విజిలెన్స్ సీఐ సద్గురు..

విజిలెన్స్ సీఐ సద్గురు గురువారం బాధ్యతలు చేపట్టారు. అన్నమయ్య జిల్లాలో వీఆర్‌లో ఉన్న ఆయన సాధారణ బదిలీల్లో భాగంగా అనంతపురం వచ్చారు. వివిజిలెన్స్ ఎస్పీ వైబీపీటీఏ ప్రసాద్‌ను కలిసి బాధ్యతలు చేపట్టారు.

శిశువు అనుమానాస్పద మృతి

వ్యాక్సిన్ వికటించిందని తల్లిదండ్రుల ఆరోపణ



శిశువు మృతదేహాన్ని పరిశీలిస్తున్న వైద్యులు

డి.హీరేహాళ్, జనవరి 9(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కుడ్లూరు గ్రామంలో మూడు నెలల శిశువు గురువారం అనుమానాస్పద స్థితిలో మృతిచెందింది. గ్రామానికి చెందిన రేణుక, భాస్కర్ దంపతులకు మూడు నెలల క్రితం కూతురు పుట్టింది. ఆరు వారాల తరువాత ఒక డోస్ వ్యాక్సిన్ వేశారు. రెండో డోసు కుడ్లూరు అంగన్వాడీ కేంద్రంలో గురువారం ఉదయం ఇచ్చారు. పాప సాయంత్రం వరకూ బాగానే ఉంది. ఆ తరువాత ఆగకుండా ఏడవడం ప్రారంభించింది. పాప శరీరంలో అనూహ్యంగా మార్పులు వచ్చాయి. చెమటలు పట్టి జ్వరం వచ్చింది. శరీరంపై దద్దుర్లు వచ్చాయి. చికిత్స కోసం వెంటనే గుడిసెలపల్లిలో ఓ ఆర్ఎంపీ వద్దకు తీసుకెళ్లారు. కాసేపటికే పాప మృతి చెందింది. సమాచారం అందుకున్న డాక్టర్ జశ్వంత్ కుడ్లూరుకు వెళ్లి శిశువు మృతదేహాన్ని పరిశీలించారు. వ్యాక్సిన్ వికటించి తమ పాప మృతి చెందిందని కుటుంబ సభ్యులు ఆయనకు ఫిర్యాదు చేశారు. సమగ్రంగా విచారించి, వ్యాక్సిన్ వికటించినట్లు తేలితే బాధ్యులపై చర్యలు తీసుకుంటామని ఆయన బాధితులకు హామీ ఇచ్చారు.

పొలాలలో గుర్తుతెలియని మృతదేహం

గుంతకల్లు టౌన్, జనవరి 9(ఆంధ్రజ్యోతి): కసాపురం-నంచర్ల గ్రామానికి వెళ్లే దారి పక్కన ఓ పొలంలో 35 సంవత్సరాల వయసు గల గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైందని కసాపురం పోలీసులు గురువారం తెలిపారు. కసాపురం గ్రామానికి చెందిన సోమిరెడ్డి పొలంలో కుళ్లిపోయి, గుర్తుపట్టలేని స్థితిలో మృతదేహాన్ని గుర్తించామని వారు తెలిపారు. మృతి చెంది నెల రోజులై ఉంటుందని, మృతుడు నలుపు, తెలుపు చుక్కల చొక్కా ధరించాడని తెలిపారు. మృతదేహానికి అక్కడే పోస్టుమార్టం నిర్వహించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

దొరికారు.. దొంగలు

గుంతకల్లు, జనవరి 9(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మోదీనాబాద్‌కు చెందిన అనంత రత్నమ్మ అనే వృద్ధురాలి మెడలో బంగారు గొలుసును తెంచుకుని పారిపోతున్న ఇద్దరిని స్థానికులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. వివేకానంద నగర్ రైల్వే క్వార్టర్సు వద్ద కాలినడకన వెళుతున్న వృద్ధురాలిని నంబరులేని బైక్ మీద వచ్చిన ఇద్దరు అటకాయించారు. ఆమె మెడలో ఉన్న బంగారు గొలుసును తెంచుకుని పారిపోయారు. వృద్ధురాలు కేకలు వేయడంతో అప్రమత్తమైన ఇద్దరు రైల్వే ఉద్యోగులు బైక్‌ను వెంబడించి వారిని పట్టుకున్నారు. దేహశుద్ధిచేసి కసాపురం పోలీసులకు అప్పగించారు.

మెరుగు పెడతానని.. నామం పెట్టాడు..!

యాడికి, జనవరి 9(ఆంధ్రజ్యోతి): బంగారానికి మెరుగు పెడతామని నమ్మించి.. నారాయణమ్మ అనే వృద్ధురాలి వద్ద రెండు తులాల బంగారు గొలుసును కాజేశారు. చందన గ్రామంలో గురువారం ఈ ఘటన జరిగింది. ఇంటి వద్ద ఆరుబయట కూర్చున్న వృద్ధురాలి వద్దకు గుర్తుతెలియని వ్యక్తి వచ్చి, బంగారానికి మెరుగుపెడతానని, వ్యర్థాలన్నీ తొలగిస్తానని నమ్మించాడు. దీంతో నారాయణమ్మ తన మెడలో ఉన్న రెండు తులాల బంగారు గొలుసును అతనికి ఇచ్చింది. మెరుగు పెట్టే పేరిట ఆమెను ఏమార్చి.. నకిలీ చైను ఇచ్చాడు. గంటపాటు తాకవద్దని చెప్పి.. ఉడాయించాడు. గంట తర్వాత చూసుకున్న నారాయణమ్మ మోసపోయినట్లు గ్రహించి లబోదిబోమంటూ పోలీసులకు ఫిర్యాదు చేసింది.

వ్యక్తి ఆత్మహత్య

ఉరవకొండ, జనవరి 9(ఆంధ్రజ్యోతి): వజ్రకరూరులోని పామిడి రోడ్డులో శ్రీకాంత్(26) అనే వ్యక్తి చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రాగులపాడు గ్రామానికి చెందిన శ్రీకాంత్, ఓ మహిళ పట్ల దురుసుగా ప్రవర్తించాడు. దీంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేస్తారనే భయంతో తన అక్క ఊరైన వజ్రకరూరుకు వెళ్లి.. పామిడి రహదారిలో ఉరివేసుకున్నాడు. బంధువులు గమనించి, ఉరవకొండ ప్రభుత్వసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. శ్రీకాంత్ భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

మహిళ అదృశ్యం

అనంతపురం క్రైం, జనవరి 9(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఓ వస్త్ర దుకాణంలో పనిచేస్తున్న రాగిరి ధరణి అదృశ్యమయ్యారు. అనంతపురం రూరల్ మండలం కురుగుంటకు చెందిన ఆమె ఈ నెల 8వతేదీ మధ్యాహ్నం నుంచి కనిపించడం లేదు. దీంతో ఆమె తల్లి నాగవేణి వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

చీనీ టన్ను రూ.24వేలు

అనంతపురం రూరల్, జనవరి 9(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో గురువారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.24 వేలు పలికినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. కనిష్ఠంగా రూ.5వేలు, సరాసరి రూ.16వేలతో అమ్ముడుపోయినట్లు తెలిపారు. మార్కెట్‌కు మొత్తం 33 టన్నుల చీనీ కాయలు వచ్చాయన్నారు.

తగ్గిన పప్పుశనగ ధర

పక్షం రోజుల్లో మార్కెట్‌కు కొత్త సరుకు..
రేటు మరింత తగ్గే అవకాశం



గోడౌన్‌లో నిల్వ ఉన్న పప్పుశనగ

గుంతకల్లు, జనవరి 9(ఆంధ్రజ్యోతి): విదేశీ దిగుమతులతో పప్పుశనగ ధర బాగా తగ్గింది. మరో రెండు వారాల్లో కొత్త పంట వస్తున్న తరుణంలో ఆ రేటు మరింత తగ్గనుంది. గత సంవత్సరం సెప్టెంబరులో క్వింటా ధర గరిష్ఠంగా రూ.7,600 పలికింది. కేంద్ర ప్రభుత్వం టాంజానియా నుంచి పప్పుశనగను దిగుమతి చేసింది. దీంతో అంతదాకా పెరుగుతూ వచ్చిన పప్పుశనగ ధర.. అప్పటి నుంచి తగ్గుతూ వచ్చింది. ప్రస్తుతం క్వింటా ధర రూ. 6,400 ఉన్నా ఆ రేటుతో కొనేవారు కరువయ్యారు. మరో పక్షం రోజుల్లో రబీ పంట చేతికి రానుంది. ఈ తరుణంలో పప్పుశనగ ధర మరింత తగ్గనున్నాయి. ప్రస్తుతమున్న రేటు కంటే రూ. 700 తక్కువకు పప్పుశనగ ధరలు తగ్గే పరిస్థితులు ఉన్నాయి. సంక్రాంతి పండుగ తర్వాత పప్పుశనగ పంటకోతలు చేపట్టడానికి రైతులు ఎదురుచూస్తున్నారు.

పండగ తర్వాత కోతలు

ఈ సంవత్సరం వర్షాలు తగినంతగా రావడం, తుఫానులు భయపెట్టినా.. పప్పుశనగ పైర్లు అనుకున్నంతగా దెబ్బతినలేదు. గత నెల నుంచి చలి తీవ్రత ఎక్కుగా ఉండటంతో పప్పుశనగ ఫలసాయంపై రైతులు ఆశలు పెట్టుకుని ఉన్నారు. ఎకరాకు ఆరు నుంచి ఎనిమిది క్వింటాళ్ల దిగుబడులు వచ్చే అవకాశం ఉందని భావిస్తున్నారు. సంక్రాంతి పండుగ తర్వాత పప్పుశనగ కోతలు చేపట్టడానికి గుంతకల్లు, ఉరవకొండ, పామిడి, వజ్రకరూరు, విడపనకల్లు తదితర మండలాల రైతులు సిద్ధంగా ఉన్నారు. ప్రస్తుతం కంది పంట కోతలు జరుగుతున్నందున... పప్పుశనగ రైతులు పండుగ తర్వాత కోతలు చేపట్టడానికి సిద్ధమవుతున్నారు. ఈ నెల 20వ తేదీకల్లా పప్పుశనగ కోతలు ముమ్మరం కానున్నాయి.

ఆగస్టు దాకా ధర కష్టమే

గత ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో క్వింటా రూ. 7,600 దాకా పెరిగింది. ధర మరింత పెరిగి రూ. 8,000 చేరుతుందని భావించిన రైతులు, వ్యాపారులు గిడ్డంగుల నుంచి పప్పుశనగ సరుకును తీయకుండా అలాగే ఉంచారు. ధర విపరీతంగా పెరగడంతో కేంద్ర ప్రభుత్వం టాంజానియా, ఆస్ట్రేలియా దేశాల నుంచి పప్పుశనగ దిగుమతులు చేసుకుంది. దీంతో ఒక్కసారిగా రేట్లు పతనమయ్యాయి. గత సెప్టెంబరు నుంచి రేటు పడిపోతూ వచ్చింది. రబీ పంటకాలం సమీపిస్తుండటంతో ఇక ధర పెరగదనే నిర్ణయానికి వచ్చి డిసెంబరులో రూ. 7,000, రూ. 6,800 ధరతోనే తక్కువ లాభాలకు అమ్మేశారు. ప్రస్తుతం క్వింటాలు ధర రూ.6,400 ఉండగా, ధర మరింత తగ్గిపోతుందని భావించిన వ్యాపారులు పాత సరుకును కొనడం నిలిపివేశారు. ఈ కారణంగా కిందటి సంవత్సరానికి సంబంధించిన దిగుబడులు గోడౌన్లలో అలాగే నిలిచిపోయాయి. గత ఫిబ్రవరిలో గోడౌన్లకు తరలిన ఫలసాయాలలో దాదాపు 10 శాతం ప్రస్తుతం గిడ్డంగుల్లో అలాగే ఉండిపోయింది. రబీ పంటకోతలు పూర్తయితే ఫిబ్రవరిలో క్వింటా ధర రూ. 5,700కు తగ్గే అవకాశాలున్నాయి. కాగా గత సంవత్సరం ఇదే సమయానికి పప్పుశనగ ధర రూ. 6,000 ఉండగా ఈ సంవత్సరం రూ. 6,400 ఉంది. కాగా, ఈ ఆగస్టుకల్లా పప్పుశనగ ధర రూ.9,000 నుంచి రూ. 10,000 వేలకు చేరుతుందని రైతులు భావిస్తున్నారు.





కోతలకు సిద్ధమవుతున్న పప్పుశనగ కమతం

న్యూస్ బాక్స్

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ



ఆంజనేయస్వామి

ధర్మవరం, జనవరి 9(ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీనివాస నగర్‌లోని వెంకటేశ్వర స్వామి ఆలయంలో గురువారం విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ఉదయం కళాన్యాసం, పంచామృతాభిషేకం, ప్రాణ ప్రతిష్ఠ, బలి, జ్వాల కుష్మండ చేధన, కలిస ఉద్వాసన, మర్దన, మహా మంగళహారతి పూజలు, హోమాలు నిర్వహించారు. భక్తులు ఆంజనే యస్వామికి ప్రత్యేక పూజలు చేయించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు చెన్నంశెట్టి జగదీశ్‌ప్రసాద్, జింకా రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

ఘనంగా తిరుమంజన సేవ



అలంకరణలో వెంకన్న

ధర్మవరం, జనవరి 9(ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీనివాసనగర్‌లోని వెంకటేశ్వర స్వామి ఆలయంలో తిరుమంజనసేవ కార్యక్రమాన్ని అర్చకులు రాజేశ్ నిర్వహించారు. గురువారం ఉదయం స్వామివారికి స్నపన తిరుమంజనసేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. సాయంత్రం అమ్మవారికి సహస్ర నామకుంకుమార్చన తదితర పూజా కార్యక్రమాలను నిర్వహించారు. భక్తులు ఈ పూజా కార్యక్రమాల్లో పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు చేయించారు.

వైకుంఠ ఏకాదశికి దేవాలయాలు ముస్తాబు



విద్యుత్‌కాంతుల్లో కోవెలగుట్టపల్లి వెంకటేశ్వరస్వామి దేవాలయం

పుట్టపర్తిరూరల్, జనవరి 9(ఆంధ్రజ్యోతి): వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని జిల్లాకేంద్రంలోని దేవాలయాలను ముస్తాబు చేశారు. ఉత్తర ద్వారాలతో దర్శనానికి ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా జిల్లాకేంద్రంలోని కోవెలగుట్టపల్లి వెంకటేశ్వర స్వామి దేవాలయం, పట్టణంలోని వాసవీకన్యకాపరమేశ్వరి దేవాలయం, వేణుగోపాలస్వామి దేవాలయం, ఎనుమలపల్లి లక్ష్మీనరసింహస్వామి ఆలయాలను సర్వాంగసుందరంగా అలంకరించారు. ఉత్తరద్వారం ద్వారా మూలవిరాట్టును దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులూ లేకుండా ఏర్పాట్లు చేశారు.

యూత్ ఫెస్టివల్‌కు ఎంపిక



రామమోహన్

ఓబుళదేవరచెరువు, జనవరి 9(ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో జరిగే నేషనల్ యూత్ ఫెస్టివల్ (వికసిత్ భారత్ యంగ్ లీడర్స్)లో పాల్గొనడానికి మండలానికి చెందిన రామమోహన్ ఎంపికయ్యాడు. అన్నమయ్య జిల్లా తరఫున గురువారం విజయవాడలో నిర్వహించిన నేషనల్ యూత్ ఫెస్టివల్‌లో పాల్గొన్నారు. గ్రూప్ ఫోక్ డ్యాన్స్ జట్టులో ఢిల్లీలో జరిగే కార్యక్రమంలో పాల్గొనడానికి రామమోహన్ ఎంపికయ్యాడు.

రాష్ట్రస్థాయి క్రికెట్ టోర్నీలో ప్రతిభ



బృంద

ధర్మవరం, జనవరి 9(ఆంధ్రజ్యోతి): గుంటూరులో ఈనెల 6 నుంచి 8వ తేదీ వరకు నిర్వహించిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీల్లో ఉమ్మడి అనంత జిల్లా జట్టు రన్నర్‌గా నిలిచింది. కొత్తపేట ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థిని బృంద ఆ జట్టులో ఉండి ... గెలుపులో కీలక పాత్ర పోషించింది. దీంతో బృందను ఆ పాఠశాల హెచ్ఎం, మేరీవర కుమారి, పీఈటీ అశ్విని, ఉపాధ్యాయులు గురువారం అభినందించారు.

మహిళా సాధికారత పంచాయతీగా ఎంపిక

బత్తలపల్లి, జనవరి 9(ఆంధ్రజ్యోతి): బత్తలపల్లి మహిళా సాధికారత సాధించిన పంచాయతీగా ఎంపికైనట్లు ఎన్ఐఆర్‌డీ కో-ఆర్డినేటర్ నాగేశ్వరరావు తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలో జడ్పీటీసీ, ఎంపీపీ, సర్పంచ్‌లు మహిళలు కావడం ఇక్కడ మహిళా సంఘల ద్వారా మహిళా మార్ట్ నిర్వహిస్తున్నారని, ఈ పంచాయతీలో మహిళాలు ఎక్కువగా వ్యాపారాలు చేస్తున్నారని అన్నారు. ఇక్కడ అధికారులు, మహిళలు, ప్రజాప్రతినిధులు అందరూ సమన్వయం చేసుకొని అభివృద్ధి పథంలో నడిపించి ఆదర్శ పంచాయతీగా తీర్చిదిద్దితే ఈ పంచాయతీకి కోటి రుపాయలు ప్రోత్సహకం వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో డీపీఎం నిర్మల్‌ప్రకాష్, ఎంపీడీఓ నరసింహ నాయుడు, ఏఓ శ్రీనివాసులు, ఈఓఆర్‌డీ కిష్టప్ప, ఏపీఎం సుదర్శన్‌రాజు, ఏపీఓ ఆదెప్ప పాల్గొన్నారు.

పాఠశాలకు మైక్ సెట్

ఓబుళదేవరచెరువు: మండలంలోని మిట్టపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో 2015-16లో పది చదివిన పూర్వ విద్యార్థులు రూ. పదివేల విలువ చేసే మైక్‌సెట్‌ను గురువారం అందించారు. కార్యక్రమంలో హెచ్ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

న్యాక్ బృందం పర్యటన

ధర్మవరం, జనవరి 9(ఆంధ్రజ్యోతి): స్థానిక కెహెచ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం న్యాక్ బృందం పర్యటించింది. నేషనల్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్ బృందం చైర్‌పర్సన్ సదాశివభట్, కో-ఆర్డినేటర్ అనిల్‌ఓజా, సభ్యులు బాబన్ తైవాడే ఆ బృందంలో ఉన్నారు. ఐదేళ్లలో కళాశాల అభివృద్ధిని, విద్యా కార్యకలాపాలను న్యాక్ సభ్యులకు ప్రిన్సిపల్ ప్రభాకర్‌రెడ్డి వివరించారు. న్యాక్ ప్రమాణాలతో కళాశాలలో ఉన్న మౌలిక వసతులు, బోధన, పరిశో.దన తదితర అంశాలను వివరించారు. ప్రస్తుతం చదువుతున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పూర్వ విద్యార్థులతో సమావేశం నిర్వహించి.. వారి అనుభవాలను బృంద సభ్యులకు వివరించేలా చేశారు. కార్యక్రమంలో ఐక్యుయేసి కో-ఆర్డినేటర్ కిరణ్‌కుమార్, న్యాక్ కో ఆర్డినేటర్ పావని, అధ్యాపకులు పాల్గొన్నారు.



ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పర్యటిస్తున్న న్యాక్ బృందం

సంక్రాంతి శోభ



ధర్మవరం: షిర్డీసాయిబాబా ఆలయ ప్రాంగణంలో..



ధర్మవరం: కాకతీయ పాఠశాలలో...



ధర్మవరం రూరల్: గొట్లూరులోని శ్రీనివాస విద్యానికేతన్ పాఠశాలలో..



కదిరి: ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మహిళలు, బాలికలు

ఆంధ్రజ్యోతి, న్యూస్ నెట్‌వర్క్: పట్టణాలు, గ్రామాలు.. సంక్రాంతి శోభ సతరించుకుంది. ధర్మవరంలో సాయినగర్‌లోని షిర్డీసాయి బాబా ఆలయ ప్రాంగణంలో గురువారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. అలాగే ధర్మవరంలోని కాకతీయ విద్యానికేతన్ పాఠశాల, పట్టణ సమీపంలోని కొత్తపేట శ్రీఉషోదయ ఇంగ్లీషు మీడియం స్కూల్, శ్రీపద్మావతి మహిళ డిగ్రీకళాశాల, ధర్మవరం మండలంలోని గొట్లూరులోని శ్రీనివాసవిద్యానికేతన్ పాఠశాల, కదిరి మండలంలోని ఎరుకులవాండ్లపల్లి సమీపంలో హరీష్ పాఠశాల, ముదిగుబ్బ విశ్వభారతి స్కూల్, ఓబుళ దేవరచెరువు మండలంలోని రైయిన్‌బో పాఠశాలల్లో ముందస్తు సంక్రాంతి సంబరాలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఆవరణమంతా రంగురంగుల ముగ్గులు, భోగిమంటలు, పాలపొంగులతో అందంగా అలంకరించారు.



ముదిగుబ్బ: వేషధారణలో చిన్నారులు

వడ్డె ఓబన్న జయంతి నిర్ణయంపై హర్షం





కదిరి : ఎమ్మెల్యే కందికుంటకు కృతజ్ఞతలు తెలుపుతున్న నాయకులు, కొత్తచెరువు: చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

కదిరి అర్బన్, జనవరి9(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డె ఓబన్న జయంతిని అధికారికంగా నిర్వహించేలా కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంపై సూర్యవంశ వడ్డెర సంక్షేమ సంఘం నాయకులు గురువారం హర్షం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. వడ్డె ఓబన్న సేవలను గుర్తించిన ప్రభుత్వం ఈనెల 11న అధికారికంగా జయంతి వేడుకలు నిర్వహిస్తున్న ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌కు ధన్యావాదాలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ఉత్తన్న, వల్లెపు గంగరాజు, కుంచెపు గంగరాజు, ఉత్తన్న, గంగరాజు, నాగార్జున, సురేష్, లక్ష్మీనారాయణ, పీట్ల రమణమ్మ, తిరుపాల్, దేవ, కుచ్చెపు శ్రీనివాసులు, క్రిష్టప్ప పాల్గొన్నారు.

● పుట్టపర్తిరూరల్ : వడ్డె ఓబన్న జయంతిని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రాష్ట్ర పండుగగా ప్రకటించడంపై ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. వడ్డే ఓబన్న జయంతి జనవరి 11ను రాష్ట్ర పండుగగా గుర్తించాలని గత నవంబరు 19న అసెంబ్లీలో తాను ప్రస్తావించిన విషయాన్ని ఈ సందర్బం గా ఎమ్మెల్యే గుర్తుచేశారు. దీనికి ముఖ్యమం త్రికి, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, బీసీ సంక్షే మశాఖ మంత్రి సవిత స్పందించడం సంతోషిం చతగ్గ విషయమన్నారు. వడ్డెర్ల తరుపున వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

● కొత్తచెరువు: వడ్డె ఓబన్న జయంతిని ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించేలా జీఓ జారీ చేయడంపై హర్షం వ్యక్తం చేస్తున్నారు. స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో టీడీపీ పట్టణ కన్వీనర్ ఒలిపి శీనా ఆధ్వర్యంలో వడ్డెర్ల సంఘం నాయకులు, టీడీపీ నాయకులు చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు.

● ఓబుళదేవరచెరువు: వడె ఓబన్న జయంతిని రాష్ట్రవ్యాప్తంగా అధికారికంగా ఈనెల 11న నిర్వహించేలా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రకటించడంపై వడ్డెర సంఘం నాయకులు గురువారం హర్షం వ్యక్తం చేశారు. పీట్ల సుధాకర్, పీట్ల మనోహర్, ఆటోరామాంజి, వైదేహి, జెరిపిటి అంజినప్ప, జెరిపిటి ప్రసాద్, ఎంపీటీసీ శ్రీనివాసులు.. ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

అన్న క్యాంటీన్ తనిఖీ

ధర్మవరం జనవరి 8(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వాస్పత్రి వద్ద ఉన్న డొక్కా సీతమ్మ అన్న క్యాంటీన్‌ను మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్ గురువారం తనిఖీ చేశారు. అన్న క్యాంటీన్‌లకు వచ్చే ప్రజలకు నాణ్యమైన భోజనం అందించాలని సిబ్బందికి సూచించారు. అక్కడ అల్పాహారం చేస్తున్న వారితో మాట్లాడారు. మెనూ ప్రకారం ప్రజలకు నాణ్యమైన భోజనం అందిస్తున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. పరిశుభ్రత పాటించాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్లు శ్యామ్సన్, కేశవ ఉన్నారు.

● కిశోరి వికాసంపై అవగాహన

కిశోరి వికాస్ పథకంపై స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ ప్రమోద్ కుమార్ గురువారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజలలో అవగాహన కల్పించి బాలికల భవిష్యత్తుకు భద్రత కల్పిద్దామని సూచించారు. బాలికల విద్య, ఆరోగ్యం, భద్రత ఆర్థిక స్వావలంబన మెరుగుపరచడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో సీడీపీఓ లక్ష్మి, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

పెండింగ్ పనులను పూర్తి చేయండి: కలెక్టర్

పుట్టపర్తిటౌన్, జనవరి 9(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో చేపట్టిన భూసేకరణకు సంబంధించిన అన్ని పనులను సత్వరమే పూర్తి చేయాలని కలెక్టర్ టీఎస్ చేతన్ ఆదేశించారు. గురువారం సాయంత్రం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో పీడీ ఎన్‌హెచ్, ఎన్‌హెచ్‌ఏఐ, రైల్వే, ఆర్‌అండ్‌బీ, అటవీశాఖ, చిన్న నీటిపారుదల, భూ సేకరణ పలు అంశాలను సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్యాకేజీ1, ప్యాకేజీ2 కింద లైన్ షిఫ్టింగ్ వివరాలను అందించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అటవీశాఖ అధికారి చక్రపాణి, ఎన్‌హెచ్‌పీడీ ఆశోక్ రెడ్డి, డీఈ గిడ్డయ్య, నేషనల్ హైవే మేనేజర్ ముత్యాలరావు పాల్గొన్నారు.

ఘనంగా ఫాతిమా షేక్ జయంతి

కదిరి అర్బన్, జనవరి 9(ఆంధ్రజ్యోతి): సావిత్రీబాయి పూలే శిష్యురాలు ఫాతిమాషేక్ జయంతిని గురువారం బహుజన పరిరక్షణ సేవాసమితి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని వికలాంగుల భవనంలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళ్లు అర్పించారు. కార్యక్రమంలో బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి షేక్ ఇర్షాన్, సేవాసమితి నాయకులు కేఆర్ హరిప్రసాద్, వేణుగోపాల్, మనోహర్, పవన్‌కుమార్, దిల్‌షాద్, రామలమ్మ, శోభారాణి పాల్గొన్నారు.



ఫాతిమాషేక్ చిత్ర పటం వద్ద నివాళ్లు అర్పిస్తున్న దృశ్యం

పేదలకు ఇంటి పట్టాలివ్వాలి

ఓబుళదేవరచెరువు, జనవరి 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని పేదలకు ఇంటిపట్టాలతో పాటు ఇళ్లు మంజూరు చేయాలని బీజేపీ మండలాధ్యక్షుడు ఈ. వీరాంజనేయులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం తహసీల్దార్ అనంతచారికి వినతిపత్రం ఇచ్చిన ఆయన మాట్లాడారు. మండలంలో చాలామంది నిరుపేదలు ఇళ్లు లేక అద్దె ఇళ్లలో నివాసం ఉంటున్నారన్నారు. వెంకటాపురం పంచాయతీ, ఎంకొత్తపల్లి గ్రామ పొలంలోని సర్వేనెంబర్ 216లో 2.71 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని, ఆ భూమిలో పేదలకు, విలేకరులకు ఇంటిపట్టాలు ఇవ్వాలని కోరారు. ఆయన వెంట నాయకులు సుదర్శన్‌రెడ్డి, శివాజీ, వెంకటరమణ ఉన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం

నల్లమాడ, జనవరి9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎద్దులవాండ్లపల్లి తండాకు చెందిన టీడీపీ కార్యకర్త జయరాంనాయక్ రోడ్డు ప్రమాదంలో గాయపడి... మరణించిన విషయం తెల్సిందే. ఈ విషయం తెలుసుకున్న ఎంపీపీ పాఠశాల హెచ్ఎం రామావత్ చాప్లానాయక్, టీడీపీ నాయకులు గురువారం ఆ గ్రామానికెళ్లి మృతుడి కుటుంబాన్ని పరామర్శించారు. హెచ్ఎం రూ. మూడు వేలు అందజేశారు. వారి వెంట నాయకులు బుట్టినాగభూషనాయుడు, నరసింహులు, అక్కులప్ప నాయక్, చంద్రనాయక్, బయ్యారెడ్డి ఉన్నారు.

అమిత్‌షాను మంత్రి పదవి నుంచి తొలగించండి

నల్లమాడ: అంబేద్కర్‌ను విమర్శించిన కేంద్ర మంత్రి అమిత్‌షాను మంత్రి పదవి నుంచి తొలగించాలని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు గౌస్‌బాషా డిమాండ్ చేశారు. గురువారం స్థానిక పంచాయతీ కార్యాలయం సమీపంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఆయన మాట్లాడారు. ఎన్‌డీఏ కూటమిపేరు పెట్టుకున్న నాయకులు ఇలా మాట్లాడడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో రమణ, నారాయణ, లక్ష్మీదేవి పాల్గొన్నారు.

పోస్టర్ విడుదల

ఓబుళదేవరచెరువు, జనవరి 9(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ సమస్యలపై ఈనెల 11న విజయవాడలో తలపెట్టిన మహాధర్నాకు సంబంధించిన పోస్టర్‌ను కొండకమర్లలో డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు గౌస్‌లాజం గురువారం ఆవిష్కరించారు. ఈ ధర్నాకు పెద్ద ఎత్తున ఉపాధ్యాయులు తరలివచ్చి.. విజయవంతం చేయాలని కోరారు ఈ కార్యక్రమంలో మండలాధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్‌సీ నరసింహులు, సోముశేఖర్‌నాయక్, నాగరాజు, అతావుల్లా, సిద్దయ్య, చంద్రకళ పాల్గొన్నారు.

ఈమిర్చా కార్యక్రమంపై అవగాహన

తనకల్లు, జనవరి 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని కనసనివారిపల్లిలో ఉద్యానవన శాఖ డిజిటల్ గ్రీన్ సంయుక్తంగా ఈమిర్చాపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఉద్యానవనశాఖాధికారి లావన్య రైతులకు నేల నమూనాల సేకరణ పద్దతులు, పరీక్ష ప్రక్రియలు, వాటి ప్రయోజనాలపై ప్రదర్శన నిర్వహించారు. డిజిటల్ గ్రీన్ ప్రతినిధి శ్రీకాంత్, రైతులు ఇందులో పాల్గొన్నారు.

వాల్మీకులను ఎస్టీల్లో చేర్చాలి

ఓబుళదేవరచెరువు, జనవరి 9(ఆంధ్రజ్యోతి): వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాలో చేర్చాలని వాల్మీక సంఘం నాయకులు స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద గురువారం నిరసన చేపట్టారు. అనంతరం తహసీల్దార్ అనంతచారికి వినతపత్రం అందించారు. ఇందులో ఆ సంఘం నాయకులు నాగవేణి, మల్లికార్జున, నారాయణస్వామి, మీసేవా సుధాకర్, మద్దిలేటి మనోహర్, శ్రీరాములు, ఆది, వెంకటస్వామి పాల్గొన్నారు.

● కదిరి అర్బన్: వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాలో చేర్చాలని రాష్ట్ర వాల్మీకి సంఘం అధ్యక్షుడు బంగారు క్రిష్ణమూర్తి ఆర్డీఓ కార్యాలయ ఏఓ మనోహర్‌కు గురువారం వినతిపత్రం అందచేశారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు ప్రమీల, వంశీ, సుధాకర్, గంగరాజు, రామాంజనేయులు, సురేష్, శ్రావణమూర్తి, నరసింహులు పాల్గొన్నారు.

● తనకల్లు : వాల్మీకులను ఏస్టీ జాబితాలో చేర్చాలని గురువారం తహసీల్దార్ వద్ద వాల్మీకి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బంగారు క్రిష్ణమూర్తి ఆధ్వర్యంలో తహసీల్దార్ శోభావర్ణమ్మకు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు వాల్మీకి అశోక్, పలువురు నాయకులు పాల్గొన్నారు.



ఓడీసీ : తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న సంఘం నాయకులు

క్రైం న్యూస్..

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ధర్మవరం, జనవరి 9(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఫ్లైఓవర్ బ్రిడ్జిపై బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో కలకత్తా వాసి బింపుల్ బర్మన్ (27) తీవ్రంగా గాయపడ్డాడు. అనంతపురం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ అతను గురువారం మరణించాడు. ఇతను ధర్మవరానికి బేల్దారి పనుల కోసం వచ్చాడు. ఇందులో ద్విచక్ర వాహనంలో ఫ్లై ఓవర్ బ్రిడ్జిపై వెళ్తుండగా బైకు అదుపు తప్పి కిందకు పడి తీవ్రంగా గాయపడ్డాడు. అతన్ని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం అనంతపురం ఆస్పత్రికి తరలించారు. ఆక్కడ చికిత్స పొందుతూ మరణించాడని వన్‌టౌన్ సీఐ నాగేంద్రప్రసాద్ తెలిపారు. కేసు దర్యాప్తులో ఉంది.

అదృశ్యమైన మహిళ అప్పగింత

గాండ్లపెంట, జనవరి 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని కటారుపల్లిలో పనిచేస్తున్న ఎంపీఓ రోజా, ఆమె మూడేళ్ల చిన్నారి కనిపించడం లేదని ఈనెల మూడున రోజా భర్త శ్రీనివాసులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. బెంగుళూరులో ఉన్న ఆమె మేనమామ వద్దకు వెళ్లిందని సమాచారం తెలుసుకున్న పోలీసులు ఆమెను గురువారం స్టేషన్‌కు రప్పించారు. ఆమె వెళ్లడానికి కారణాలను తహసీల్దార్ బాబురావు ఆరా తీశారు. భర్తతో గొడవల కారణంగా ఆమె వెళ్లినట్లు తెలిసింది. అనంతరం ఆమె తన తండ్రి నరసప్ప వద్దకు వెళ్తానని చెప్పడంతో ఆమెను, చిన్నారని ఆమె తండ్రికి అప్పగించినట్లు హెడ్‌కానిస్టేబుల్ రామమోహన్, పీసీ శ్రీనివాసులు తెలిపారు.

భవన యజమానులకు నోటీసులు

పుట్టపర్తి,జనవరి 9(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ పరిధిలోని 52 భవనాలకు నోటీసులు జారీ చేసినట్టు మున్సిపల్ కమిషనర్ ప్రహల్లాద గురువారం ప్రకటనలో పేర్కొన్నారు. నిబంధనలకు విరుద్ధంగా భవనాలు నిర్మించకపోవడం, ఎయిర్‌పోర్ట్ అనుమతులు లేకపోవడం, ఖాళీ స్థలాలకు పన్ను చెల్లించకుండా భవనాలు నిర్మించడంతో.. ఆయా యజమానులకు నోటీసులు అందజేశామన్నారు. దీనిపై సకాలంలో స్పందించని బిల్డర్లకు కోర్టులో చార్జ్‌షీటు ఫైల్స్ వేయనున్నట్టు కమిషనర్ తెలిపారు.

రస్తా సమస్య పరిష్కారం

కొత్తచెరువు, జనవరి 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని యర్రపల్లి సమీపంలోని అమావసమ్మ గుడికి వెళ్లే రహదారిపై చాలా కాలంగా వివాదముంది. నాలుగు సంవత్సరాలుగా ఆ దారిలో వెళ్లకుండా కొందరు ఇబ్బందులు కలిగిస్తున్నారు. దీంతో ఇటీవల సమస్యను కలెక్టర్ దృష్టికి చెన్నమరాజుపల్లి ప్రజలు తీసుకెళ్లారు. సమస్యను పరిష్కరించాలని ఆయన ఆర్డీఓ సువర్ణ, తహసీల్దార్ నీళ్లకంఠారెడ్డికి ఆదేశించారు. దీంతో వారు గురువారం గ్రామానికి వెళ్లి.. వివాద రస్తాను పరిశీలించారు. అటంకం కల్పించేవారితో చర్చించి ఎవరికి ఇబ్బంది లేకుండా ఆ సమస్యను పరిష్కరించారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ సురేష్, రైతులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

విద్యార్థులకు వేమన పద్య పోటీలు



విజేత విద్యార్థులతో పాఠశాల సిబ్బంది

కదిరి అర్బన్, జనవరి 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని కుమ్మర వాండ్లపల్లి ప్రాథమిక పాఠశాలలో గురువారం విద్యార్థులకు శ్రీ వేమన ఫౌండేషన్ ఆధ్వర్యంలో వేమన పద్యపోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో విద్యార్థులు ఉత్సహంగా పాల్గొన్నారు. పోటీల్లో ప్రతిభ చాటిన వై. లిఖిత, లుక్‌మాన్, ఎస్.వలీకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందించారు. పోటీలో పాల్గొన్న విద్యార్థులందరికి పెన్నులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు వరదారెడ్డి పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ.. నేరం



మాట్లాడుతున్న జిల్లావైద్యాధికారి ఫైరోజాబేగం

పుట్టపర్తిరూరల్, జనవరి 9(ఆంధ్రజ్యోతి): లింగనిర్ధారణ చేయడం చట్టరిత్యా నేరమని, వాటిని నిర్వహించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లావైద్యాధికారి ఫైరోజాబేగం హెచ్చరించారు. గురువారం స్థానిక జిల్లావైద్యాధికారి కార్యాలయంలో అధికారులతో నిర్వహించిన సమావేశంలో జిల్లా వైద్యాధికారి మాట్లాడారు. ప్రతి ఒక్కరూ లింగనిర్ధారణ చట్టంపై పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు, సలహా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

భక్తిశ్రద్ధలతో అయ్యప్పస్వామి పడిపూజ

గుడిబండ/రొళ్ల, జనవరి 9(ఆంధ్రజ్యోతి): గుడిబండ మండలం జంబులబండ గొల్లహట్టి గ్రామంలో గురువారం అయ్యప్పస్వాములు పడిపూజ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పూజలో భాగంగా భక్తులు భజనలు చేశారు. గురుస్వామి, చిత్రశేఖర్‌స్వామి, మాలధారులు పాల్గొన్నారు.

గుడిబండ: మండలంలోని జంబులబండ గ్రామంలో గురువారం అయ్యప్ప భక్తులు ఇరుముడి కార్యక్రమాన్ని నిర్వహించారు. మాలధారులు అయ్యప్పస్వామి చిత్రపటానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఇరుముడి కార్యక్రమాన్ని చేపట్టారు.

భూ రీసర్వేను సద్వినియోగం చేసుకోండి

అగళి, జనవరి 9(ఆంధ్రజ్యోతి): రైతులు రీ ప్రాజెక్ట్, రీసర్వేను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ సుబ్బారావు కోరారు. మండలంలోని ఏకేడిహళ్లి గ్రామంలో గురువారం రీసర్వే సభ నిర్వహించారు. ఆర్ఐ చంద్రశేఖర్‌రావు, వీఆర్‌ఓ ప్రకాశ్, మండల సర్వేయర్ మారుతిప్రసాద్, మండల కన్వీనర్ కుమారస్వామి పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం


సీఎం, డిప్యూటీ సీఎం చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

పెనుకొండ టౌన్, జనవరి 9(ఆంధ్రజ్యోతి): వడ్డె ఓబన్న జయంతి 11వ తేదీన అధికారికంగా నిర్వహిస్తామని ప్రభుత్వం ప్రకటించడాన్ని హర్షిస్తూ వడ్డెర సంఘం ఆధ్వర్యంలో సీఎం, డిప్యూటీ సీఎం చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. గురువారం మడకశిర సర్కిల్‌లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. వడ్డె ఓబన్న జయంతిని అధికారికంగా ప్రకటించడంలో చొరవ చూపిన బీసీ సంక్షేమ చేనేత జౌళిశాఖ మంత్రి సవితకు కృతజ్ఞతలు తెలిపారు. గోవిందరాజులు, నారాయణప్ప, నాగప్ప, పల్లవరాజు, శ్రీహరి, చంద్ర, యల్లప్ప, రాజు పాల్గొన్నారు.

వీల్‌చైర్ వితరణ


ప్రవీణకు వీల్‌చైర్ అందచేస్తున్న ఎంఈఓ

గోరంట్ల, జనవరి 9(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎమ్మార్సీ వద్దనున్న భవిత కేంద్రంలో దివ్యాంగురాలు ప్రవీణకు స్థానిక లయన్స్‌క్లబ్ వారు వీల్‌చైర్‌ను గురువారం వితరణ చేశారు. మల్లెల గ్రామానికి చెందిన ఏడేళ్ల చిన్నారి ప్రవీణ రెండుకాళ్లు దెబ్బతిని నడవలేని స్థితిలో ఎత్తుకెళ్లాలిన పరిస్థితి. గోరంట్ల లయన్స్‌క్లబ్ అధ్యక్షులు రాజేష్ వీల్‌చైర్‌ను ఎంఈఓ జాన్‌రెడ్డెప్ప చేతుల మీదుగా అందజేశారు. క్లబ్ సభ్యులు దస్తగిరి, నాగరాజు, గిరిధర్‌గౌడ్, శ్రీనివాసులు, శీనా, జయలక్ష్మి, శివ, ఉపాధ్యాయులు విద్యాసాగర్, చాంద్‌బాషా పాల్గొన్నారు.

గర్భిణులకు అన్నదానం


అన్నదానంలో పాల్గొన్న టీడీపీ నాయకులు

సోమందేపల్లి, జనవరి 9(ఆంధ్రజ్యోతి): ఎస్ఆర్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం గర్భిణులు, బాలింతలకు అన్నదాన కార్యక్రమాన్ని టీడీపీ నాయకులు చేపట్టారు. ప్రాథమిక ఆరోగ్యకేంద్రం నుంచి ఆసుపత్రికి వచ్చిన మహిళలకు పౌష్టికాహారాన్ని అందించారు. వైద్యులు ఓంకార్, కన్వీనర్ సిద్ద లింగప్ప, మాజీ జెడ్పీటీసీ రామక్రిష్ణ, మండల కార్యదర్శి సూర్యనారాయణ, మాగేచెరువు సర్పంచ్ నరసింహులు, ఎంపీటీసీ కిష్టప్ప, మద్దిలేటి పాల్గొన్నారు.

గోరంట్ల: పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స కోసం వచ్చిన గర్భిణులు, బాలింతలకు సత్యసాయి సేవాదల్ జిల్లా కోఆర్డినేటర్ విజయలక్ష్మి, శివారెడ్డి దంపతులు గురువారం పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. వైద్యులు వినోద్‌కుమార్, ఉషా, భజన మండలి రత్నయ్య శెట్టి, సుబ్బరాయుడు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధే సంస్థ ధ్యేయం


గంగపూజలో ధర్మస్థల సంఘం సభ్యులు

పావగడ, జనవరి 9(ఆంధ్రజ్యోతి): గ్రామాభివృద్ధే ధర్మస్థల క్షేమాభివృద్ధి సంఘం ధ్యేయమని తాలూకా కన్వీనర్ మహేష్ అన్నారు. గుజ్జారహళ్లిలోని కరియప్పల చెరువులో గంగపూజ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రూ.15లక్షలతో గుజ్జరహళ్లి చెరువు పూడికతీత పనులు చేపట్టి నైపుణ్యంగా తీర్చిదిద్దారని వర్షపు నీరు పూర్తిగా నిలువ ఉండటంతో బోరు బావులకు భూగర్భజలాలు పెంపొందించి పంట పొలాలు సమృద్ధిగా పండుతాయని రైతు సంఘం అధ్యక్షుడు నరసింహారెడ్డి అన్నారు. కార్యక్రమంలో న్యాయదగుంటె గ్రామపంచాయతీ అధ్యక్షులు గిరిజమ్మ, ఉపాధ్యక్షులు రాధమ్మ, సంఘ సభ్యులు రత్నమ్మ, రాజగోపాల్, ప్రసాద్, దయానంద, మహిళలు పాల్గొన్నారు.

13న ముగ్గుల పోటీలు


కరపత్రాలు విడుదల చేస్తున్న టీడీపీ నాయకులు

పెనుకొండ టౌన్, జనవరి 9(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ సందర్భంగా 13వ తేదీన ముగ్గుల పోటీలు నిర్వహించనున్నట్లు టీడీపీ కన్వీనర్ శ్రీరాములు తెలిపారు. స్థానిక పార్టీ కార్యాలయంలో గురువారం ముగ్గుల పోటీలకు సంబంధించి నగదు బహుమతి, పోటీల నిబంధనలను వివరించారు. ఆయన మాట్లాడుతూ మంత్రి సవిత ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మొదటి బహుమతి రూ.10వేలు, రెండో బహుమతి రూ.5వేలు, మూడో బహుమతి రూ.3వేలు ఇవ్వనున్నట్లు తెలిపారు. ముగ్గుల పోటీల్లో పాల్గొన్న ప్రతి మహిళకు కన్సొలేషన్ బహుమతి ఇస్తామన్నారు. రూరల్ కన్వీనర్ సిద్దయ్య, త్రివేంద్ర, బాబుల్‌రెడ్డి, షౌకత్, చంద్రకాంతమ్మ, అనసూయ, రమణమ్మ పాల్గొన్నారు.

వైకుంఠ ఏకాదశికి ఆలయాలు ముస్తాబు

వైకుంఠ ఏకాదశి ఉత్తర ద్వార ప్రవేశం కోసం ఆలయాలు ముస్తాబయ్యాయి. శుక్రవారం తెల్లవారుజామునుంచే ఉత్తర ద్వారం నుంచి స్వామివార్లను దర్శించుకునేందుకు ఆలయాల నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశారు. హిందూపురంలోని లక్ష్మీపురం బాలాజీ ఆలయం, శ్రీనివాసమందిరం, షిర్డీసాయిబాబాల ఆలయాలను ప్రత్యేకంగా అలంకరించారు. చిలమత్తూరులోని లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో భక్తులకు అన్ని ఏర్పాట్లు చేశారు. మడకశిర పట్టణంలోని కోట వేంకటేశ్వరస్వామి, షిర్డీసాయినాథుడు, అయ్యప్పస్వామి ఆలయాలను శోభాయమానంగా అలంకరించారు. ఉత్తర ద్వారం నుంచి స్వామివారిని భక్తులు దర్శించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. పెనుకొండలోని అతిప్రాచీన వేంకటేశ్వర ఆలయం, నగరేశ్వరస్వామి, జనార్ధనస్వామి ఆలయాల్లో ఏర్పాట్లు పూర్తి చేసినట్లు నిర్వాహకులు ప్రగతి శ్రీనివాసులు, సుధాకరగుప్తా, నాగరాజు తెలిపారు. కర్ణాటక రాష్ట్రం పావగడలో వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో వైకుంఠ ద్వార దర్శనం కోసం గురువారం రాత్రి ఏర్పాట్లు పూర్తి చేశారు.

- ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్


ముస్తాబైన హిందూపురంలోని లక్ష్మీపురం బాలాజీ ఆలయం


మడకశిర: కోట వేంకటేశ్వరస్వామి ఆలయం


చిలమత్తూరు: లక్ష్మీనరసింహస్వామి ఆలయం


పెనుకొండ: లక్ష్మీవెంకటరమణస్వామి ఆలయం


మున్సిపల్ కార్యాలయంలోని శ్రీనివాస మందిరం

సామాజిక తనిఖీ బహిరంగ సభ

రొళ్ల, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణంలో పీడీ అధ్యక్షతన సామాజిక తనిఖీ బహిరంగ సభ నిర్వహించారు. కార్యక్రమానికి జడ్పీటీసీ, ఎంపీపీ హాజరుకాలేదు. మండలవ్యాప్తంగా పది పంచాయతీల్లో గ్రామీణ ఉపాధి హామీ పథకం 2023 ఏప్రిల్ నుంచి 2024 మార్చి వరకు వివిధ పనులకుగాను రూ.4.51కోట్లు ఖర్చు చేశారు. ఇందులో భాగంగా రూ.1,85,652 రికవరీ చేశారు. దొడ్డేరి రూ.7,519, హొట్టేబెట్ట రూ.4,784, బి.జి.హళ్లి రూ.60,156, మల్లినమడుగు రూ.25,961, కాకి రూ.16,500, పంచాయతీ వర్కులు రూ.23527, హులికుంట రూ.4వేలు, గుడ్డగుర్కి రూ.14వేలు, రత్నగిరి రూ.27,773, ఎం.రాయాపురం రూ.19,459, రొళ్ల రూ.5,500 రికవరీ చేసినట్లు పీడీ తెలిపారు. వక్క, అరటి రైతులు ఉపాధి హామీని అనుసంధానం చేయాలని పీడీకి వినతిపత్రం అందజేశారు. ఏపీడీ లక్ష్మీనారాయణ, ఎంపీడీఓ రామారావు, ఏపీఓ ఓబుళప్ప, మండల కన్వీనర్ దాసిరెడ్డి, గురుమూర్తి, ఈరన్న పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

మడకశిరటౌన్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ పోస్టులకు 10 నుంచి 25వతేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సీడీపీఓ నాగమల్లేశ్వరి కోరారు. అగళి మండలం గ్యారగొండనహళ్లిలో అంగన్‌వాడీ వర్కర్(ఓసీ), కె.పాళ్యం మినీ అంగన్‌వాడీ బీసీఏ, ఆయాలు సంబంధించి మడకశిర మండలంలో పత్తికుంట ఓసీ, గుడ్డంపల్లి ఓసీ, గుడిబండ మండలంలో అంగన్‌వాడీ వర్కర్లకు సంబంధించి కె.గొల్లహట్టి ఓసీ, మోరుబాగల్-2 ఓసీ, తిమ్మలాపురం పీహెచ్ ఖాళీలు ఉన్నాయన్నారు. అర్హత ఉన్న అభ్యర్థులు దరఖాస్తు ఆమె చేసుకోవాలని సూచించారు.

12న ఉచిత వైద్యశిబిరం

అమరాపురం, జనవరి 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని కె.శివరం గ్రామ ప్రాథమిక పాఠశాలలో 12వ తేదీ బెంగళూరు ఎస్ఎస్ఎం ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు జనసేన యూత్ మండల అధ్యక్షుడు శివకుమార్, డాక్టర్ ధనుంజయ, కాంతరాజు, రవికుమార్ తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, గణేష్, రంగస్వామి, ఆనందకృష్ణ హాజరవుతున్నట్లు తెలిపారు. రక్తపోటు, మధుమేహం, ఇతర పరీక్షలను నిర్వహించనున్నట్లు తెలిపారు.

నేడు గోకులాల ప్రారంభం

సోమందేపల్లి, జనవరి 9(ఆంధ్రజ్యోతి): పల్లెపండగ పంచాయతీ వారోత్సవాల్లో భాగంగా శుక్ర, శనివారాల్లో మండలంలో మంజూరై పూర్తయిన గోకులాల షెడ్లను మంత్రి సవిత, ఎంపీ పార్థసారథి ప్రారంభిస్తారని ఇన్‌చార్జి ఎంపీడీఓ నాగేంద్రకుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. 10న నడింపల్లి, 11న చాలకూరు గ్రామాల్లో కార్యక్రమం ఉంటుందన్నారు.

శతాధిక వృద్ధురాలి మృతి

సోమందేపల్లి, జనవరి 9(ఆంధ్రజ్యోతి): స్థానిక ఇందిరానగర్‌కు చెందిన శతాధిక వృద్ధురాలు మంచాల మంగమ్మ గురువారం మృతిచెందారు. తొగటవీరక్షత్రియ సంఘం అధ్యక్షుడు సీసీ హరి భౌతిక కాయాన్ని సందర్శించి పూలమాలలువేసి నివాళి అర్పించారు. ఎగువింటి రామాంజి, బండారు శీన, జగదీశ్, రంగన గోపాల్, మహేంద్ర, జయరాం, ఈశ్వర్ పాల్గొన్నారు.

మహిళ అదృశ్యం.. కేసు నమోదు

గోరంట్ల, జనవరి 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని కాగానిపల్లికి చెందిన చంద్రకళ అలియాజ్ చందన అనే మహిళ అదృశ్యంపై గురువారం కేసు నమోదు చేసినట్లు సీఐ శేఖర్ తెలిపారు. తలుపుల మండలానికి చెందిన చందన ఏడునెలల క్రితం కాగానిపల్లికి చెందిన వెంకటేషతో వివాహం జరిగింది. వెంకటేష్ బూదిలి సమీపంలోని కియ అనుబంధ పరిశ్రమలో పనిచేస్తున్నారు. బుధవారం పరిశ్రమకు వెళ్లి సాయంత్రం తిరిగి ఇంటికి రాగా భార్య కనిపించకపోవడంతో పలుచోట్ల గాలించారు. జాడ తెలియకపోవడంతో గోరంట్ల పోలీసులకు ఫిర్యాదు చేశాడు. భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

ఉచిత వైద్య పరీక్షలు

పెనుకొండ, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): దివంగత సాయి కాశేశ్వర్ జయంతిని పురస్కరించుకుని స్థానిక శివసాయి మందిరంలో నిర్వహిస్తున్న వైద్య శిబిరంలో రెండోరోజు గురువారం 375మందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. చిట్టిబాబు, హరి, బాబు పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

గోరంట్ల, జనవరి 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని నిరుపేదలకు ఇంటిపట్టాలు, ఇళ్లు నిర్మించి ఇవ్వాలని సీపీఐ ఆధ్వర్యంలో కార్మిక సంఘాల నాయకులు గురువారం అధికారులను కోరారు. అర్హులైన వారికి రెండు సెంట్లు స్థలం, ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఆర్థికసాయం పెంచి ఇవ్వాలన్నారు. గోరంట్ల తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం, అనంతరం ఆర్ఐ సోముశేఖర్‌రెడ్డికి వినతిపత్రం అందచేశారు.

ప్రభుత్వ స్థలం ఆక్రమణపై ఫిర్యాదు

గోరంట్ల, జనవరి9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బూదిలి పొలం సర్వేనెంబర్ 635-3లోని 3.80 ఎకరాల ప్రభుత్వ స్థలం కొందరు ఆక్రమిస్తున్నారని ఎమ్మార్పీఎస్ మాజీ మండల కన్వీనర్ లక్ష్మీపతి గురువారం తహసీల్దార్ మారుతికి వినతిపత్రం అందించారు. 3.80 ఎకరాల వెస్టు అసైన్డ్‌ల్యాండ్ ప్రజలు, ప్రభుత్వ అవసరాలకు ఉపయోగించాల్సి ఉండగా బూదిలి గ్రామవాసి రవి అక్రమంగా తన పేరున వైబ్‌ల్యాండ్‌లో నమోదు చేసుకున్నట్లు ఆరోపించారు. రెవెన్యూ రికార్డులను పరిశీలించి వైబ్‌ల్యాండ్‌లో తొలగించి, చర్యలు చేపట్టాలని కోరారు.

ప్రణాళికబద్ధంగా చదివితే.. విజయం సొంతం

హిందూపురం అర్బన్, జనవరి 9(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ప్రణాళికబద్ధంగా చదివితే విజయం మీ సొంతం అని అభయ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, వ్యక్తిత్వ వికాస నిపుణుడు బాలచంద్ర అన్నారు. గురువారం స్థానిక ఎంజీఎం పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పది పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులు ఏకాగ్రత, శ్రద్ధతో చదివితే విజయం వరిస్తుందన్నారు. త్వరలో జరుగనున్న పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు స్థానిక ఎంజీఎం పాఠశాలలో గమ్యం అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఫౌండేషన్ నిర్వాహకులు శ్రీనివాసులు, హెచ్ఎం సామ్రాజ్యం, ఓరియంటల్ హెచ్ఎం పెన్నోబులం, కృష్ణమోహన్, పీడీ లోక్‌నాథ్, రామాంజనేయులు, అమర్, నారాయణరెడ్డి పాల్గొన్నారు.


విద్యార్థులతో కలిసి విజయ సంకేతం చూపుతున్న స్వామి బాలచంద్ర

విద్యార్థులు ఉన్నతస్థాయికి ఎదగాలి

గుడిబండ: విద్యార్థులు చక్కగా చదువుకొని ఇంటర్మీడియట్ పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించాలని ఎంజేపీ బాలికల కళాశాల ప్రిన్సిపాల్ ప్రసాద్ అన్నారు. గురువారం ఎంజేపీ బాలికల కళాశాలలో విద్యార్థినుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. సంక్రాంతి సెలవుల సందర్భంగా విద్యార్థులు సమయాన్ని వృథా చేయవద్దన్నారు. అనంతరం విద్యార్థుల తల్లిదండ్రులకు చదువు ప్రాముఖ్యతపై వివరించారు.

మోడల్ పేపర్ల పంపిణీ

పెనుకొండ టౌన్, జనవరి 9(ఆంధ్రజ్యోతి): పదో తరగతి విద్యార్థుల కోసం రూపొందించిన మోడల్ పేపర్లను టీడీపీ నాయకులు పంపిణీ చేశారు. గురువారం ఏపీడబ్ల్యూఆర్ఎస్ బాలికల హాస్టల్‌లో, సెంట్రల్ స్కూల్, ఉర్దూ పాఠశాలలో యూటీఎఫ్ నాయకులు మోడల్ పేపర్లను విద్యార్థులకు అందజేశారు. వారు మాట్లాడుతూ మోడల్ పేపర్‌ను బాగా చదివి మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలన్నారు. ఈసారి జరిగే పదోతరగతి పరీక్షల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు రాణించాలన్నారు. యూటీఎఫ్ మండల అధ్యక్షుడు రమేష్, టీడీపీ కన్వీనర్ శ్రీరాములు, సిద్దయ్య పాల్గొన్నారు.

పెనుకొండ రూరల్: రొద్దం మండలంలోని నారనాగేపల్లి జడ్పీహెచ్ఎస్‌లో పది విద్యార్థులకు మోడల్ పేపర్లు పంపిణీ చేసినట్లు ప్రధానోపాధ్యాయుడు రామాంజనేయులు గురువారం తెలిపారు. 30మంది విద్యార్థులకు యూటీఎఫ్ ఆధ్వర్యంలో అందజేశారు.


మోడల్ పేపర్లతో విద్యార్థులు, ఉపాధ్యాయులు

ఆర్‌ఎస్కే ఇన్‌చార్జిల వివాదంపై విచారణ

గోరంట్ల, జనవరి 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని రైతు సేవా కేంద్రల్లో పనిచేస్తున్న ఇన్‌చార్జిలు, వ్యవసాయాధికారి మధ్య జరిగిన వివాదంపై ఉన్నత స్థాయి అధికారులు విచారణ చేపట్టారు. గురువారం స్థానిక పట్టుపరిశ్రమ కార్యాలయంలో పెనుకొండ అగ్రికల్చర్ ఏడీ స్వయంప్రభా ఆధ్వర్యంలో సోమందేపల్లి ఏఓ కవితరాణి, హిందూపురం సిరికల్చర్ ఏడీ సురేష్‌కుమార్, ఏఎస్‌ఓ రమణారెడ్డి విచారించారు. గోరంట్ల ఏఓ మునిక్రిష్ణ, వడిగేపల్లి విలేజీ సిరికల్చర్ అసిస్టెంటు దీప, ఇతర వీఎస్‌ఓలను విడివిడిగా విచారించారు. ఆర్‌ఎస్కే ఇన్‌చార్జిలు నెలల తరబడి సెలవులో వెళ్తూ, విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలపై ఆంధ్రజ్యోతిలో గత నెలలో 'ఇష్టారాజ్యం' అన్న కథనం ప్రచురించిన విషయం తెలిసిందే. అందుకు స్పందించిన జిల్లా అధికారి విచారణాధికారిగా స్వయంప్రభను నియమించడంతో 4వ తేదీన ఏఓ కార్యాలయంలో వీఎస్ఏ నారాయణస్వామి, ఏఓ తదితరులను విచారించారు. వీఎస్ఏ దీప అందుబాటులోలేని కారణంగా గురువారం మరోసారి విచారణకు ఆదేశించారు. దీప గత ఏడాది అక్టోబరు 13 నుంచి నవంబరు 15 వరకు సెలవులో వెళ్లి, విధులు, రైతులపట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించారని స్థానిక సర్పంచ్ నరసింహమూర్తి అధికారులకు ఫిర్యాదు చేశారు. పరస్పర ఘటనలతో దీప మనస్థాపం చెంది ఉద్యోగానికి రాజీనామా చేయడం, తరువాత ఉపసంహరించుకున్నారు. ఈనేపథ్యంలో ఆమెను గాండ్లపెంట మండలం కటారుపల్లికి బదిలీ చేయించుకున్నారు. ఏఓ తనను రిలీవ్ చేయకుండా వేధిస్తున్నారని అధికారులకు ఫిర్యాదు చేయడంతో విచారణకు ఆదేశించారు. విచారణకు దీపతో పాటు ఆమె తండి లక్ష్మయ్య, సోదరుడు ప్రవీణ్ హాజరై ఏఓ తీవ్రస్థాయిలో వేధించారని అధికారులకు తెలిపారు. పూర్తిస్థాయి విచారణ అనంతరం ఉన్నతాధికారులకు నివేదికలు సమర్పిస్తామని ఏడీ తెలిపారు.


ఏఓ మునిక్రిష్ణను విచారిస్తున్న అధికారుల బృందం

పాఠశాలల్లో సంక్రాంతి శోభ


సిద్ధార్థ పాఠశాలలో ముగ్గుల పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

పెనుకొండ రూరల్ : సంక్రాంతి పండుగను పురస్కరించుకుని పట్టణంలోని సిద్ధార్థ పాఠశాలలో గురువారం ముగ్గుల పోటీలను నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ లింగారెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులతో రంగు రంగుల ముగ్గులు వేయించి సంక్రాంతి శోభను చాటారు.

లేపాక్షి: పులమతి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు సంప్రదాయ దుస్తులతో హాజరయ్యారు. విద్యార్థినులు పాఠశాల ప్రాంగణంలో రంగు రంగులతో ముగ్గులు వేశారు. సంక్రాంతి పండగ ముందుగానే వచ్చిందని సంబరపడిపోయారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సంబరాలు జరుపుకున్నారు.


పులమతి పాఠశాలలో ముగ్గులు వేస్తున్న విద్యార్థులు


సంప్రదాయ దుస్తుల్లో అధ్యాపకులు


సంక్రాంతి సంబరాల్లో విద్యార్థినులు, అధ్యాపకులు

హిందూపురం అర్బన్: ఎస్ఎస్‌పీఆర్ మహిళా డిగ్రీ కళాశాలలో ముందుగానే సంక్రాంతి శోభ వచ్చింది. గురువారం కళాశాల ఆవరణంలో విద్యార్థులతో కలిసి ఉపాధ్యాయులు ఉత్సవాలను జరుపుకున్నారు. సంప్రదాయ దుస్తులు ధరించి భోగి మంటలు వేసి ముగ్గులు, గొబ్బెమ్మలతో అలరించారు. ప్రిన్సిపాల్ ప్రగతి, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఘనంగా చిన్మయ పాఠశాల వార్షికోత్సవం


సంప్రదాయ దుస్తుల్లో విద్యార్థులు

హిందూపురం అర్బన్, జనవరి 9(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చిన్మయ మిషన్ డీవీడీబీఎస్ డీబీ కాలనీలోని పాఠశాల 56వ వార్షికోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. దేశ విదేశాల్లో చిన్మయ విద్యాసంస్థలు అత్యంత ఆదరణ పొందుతున్నాయని మాతాజీ సుధానంద, ఎంఈఓ గంగప్ప, కరస్పాండెంట్ భీమరాజు అన్నారు. విలువలతో కూడిన విద్యను అందించినప్పుడే భవిష్యత్తులో విద్యార్థులు భావి భారత పౌరులుగా ఎదుగుతారన్నారు. అనంతరం చిన్నారులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి.

తుమల్ ఎన్నికల్లో కాంగ్రెస్ మద్దతుదారుడి గెలుపు


ఎమ్మెల్యే నుంచి నియామక పత్రం అందుకుంటున్న చంద్రశేఖర్‌రెడ్డి

పావగడ, జనవరి 9(ఆంధ్రజ్యోతి): తుమకూరు పాల ఉత్పాదక సంఘం డైరెక్టర్ ఎన్నికల్లో కాంగ్రెస్ మద్దతుదారుడు చంద్రశేఖర్‌రెడ్డి గెలుపొందారు. గత యేడాది నవంబరు 26న పాల ఉత్పాదకుల సంఘానికి తుమకూరు జిల్లా వ్యాప్తంగా ఎన్నికలు జరిగిన విషయం తెలిసిందే. పావగడ తాలూకా నుంచి 58 మంది పాల ఉత్పాదక సభ్యులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. కాంగ్రెస్ మద్దతుదారుడు చంద్రశేఖర్‌కు 29 ఓట్లు, జేడీఎస్ మద్దతుదారుడు చెన్నమల్లయ్య 28 ఓట్లు రాగా.. ఒక్క ఓటు తేడాతో చంద్రశేఖర్‌రెడ్డి గెలుపొందినట్లు ఎన్నికల అధికారులు ప్రకటించారు. కాంగ్రెస్ మద్దతుదారుడు గెలుపొందడం పట్ల ఎమ్మెల్యే వెంకటేశ్, మాజీ మంత్రి వెంకటరమణప్ప కాంగ్రెస్ నాయకులు, మునిసిపల్ కౌన్సిలర్లు హర్షం వ్యక్తం చేశారు.